

హైదరాబాద్ వార్త

షేక్‌పేట్-మాసాబ్ ట్యాంక్ మార్గంలో మోడల్ కారిడార్

* పనులపై సిపి, జిహెచ్ఎంసి కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన
* బస్సులో పర్యటించిన ఉన్నతాధికారుల బృందం
* రోడ్ల విస్తరణపై పలు కీలక నిర్ణయాలు

మాసాబ్‌ట్యాంక్ ఏరియాలో పర్యటిస్తున్న సిపి సజ్జనార్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ట్రాఫిక్ జాయింట్ సిపి జోయల్ డెవిస్, సిసిపి శ్రీనివాస్ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: నగరంలోని కీలకమైన షేక్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు ట్రాఫిక్ కష్టాలను తీర్చి, ఈ మార్గాన్ని మోడల్ కారిడార్‌గా తీర్చిదిద్దేందుకు యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీకర్ణన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పర్యటించారు. అధికారులందరూ కలిసి ఒకే బస్సులో ప్రయాణిస్తూ.. మార్గమధ్యలో ఉన్న బాటిల్ నెక్‌లు(ట్రాఫిక్ అడ్డంకులు), నీరు నిలిచే ప్రాంతాలు, ఆక్రమణలను పరిశీలించి తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు. ఎస్‌డిఐ హాస్పిటల్ వద్ద, బృందావన్ కాలనీ రోడ్ నెం.1 వద్ద కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని నిర్ణయించారు. షేక్‌పేట్ నాలా వద్ద పెలికాన్ సిగ్నల్, జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేయనున్నారు. అలాగే నానల్‌నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు వీలుగా అక్కడ ఉన్న రోటరీ వెడల్పును తగ్గించి, రహదారిని విస్తరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే రేతిబౌలి నుంచి నానల్‌నగర్ వరకు ఉన్న సెంట్రల్ మీడియన్‌ను, అడ్డంగాఉన్న చెట్లను తొలగించి రోడ్డును వెడల్పు చేయనున్నారు. ఎన్ఎమ్‌డిసి, డెల్ స్టోర్ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ ప్రకారం భూసేకరణ చేపట్టి రహదారి విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రహదారి మధ్యలో ఉన్న రామాలయం ఆర్చ్, బొడ్డురాయి, అలాగే షేక్‌పేట్ నాలా సమీపంలోని సమాధులను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కమిషనర్లు ఆదేశించారు. మాసాబ్ ట్యాంక్ ఫ్లైఓవర్ వద్ద ఎత్తు పరిమితి బారియర్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. మెహదీపట్నం వైపు ఉన్న ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించి, పోచమ్మ బస్తీ నుంచి రోడ్ నెం.12కు నేరుగా వెళ్లేలా స్లిప్ రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. సీపీ సజ్జనర్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా తక్షణమే చేయదగ్గ పనులు, దీర్ఘకాలిక పనులను గుర్తించామన్నారు. జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ, నగరంలోని ట్రాఫిక్ పనుల నిమిత్తం ప్రతి జోన్‌కు రూ. 20 కోట్ల చొప్పున మొత్తం రూ. 120 కోట్లు కేటాయిస్తున్నామని వెల్లడించారు. కేబీఆర్ పార్క్ వద్ద పెండింగ్‌లో ఉన్న పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ జాయింట్ సిపి జోయల్ డెవిస్, జోనల్ కమిషనర్లు జి ముకుందరెడ్డి, ప్రియాంక ఆలా, ట్రాఫిక్ డిసిపి కాజల్, సిసిపి కె.శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్ ఎస్. రత్నాకర్ గోల్కోండ), అధికారులు పాల్గొన్నారు.

నాలాల్లో పూడికను తొలగించాలి

హైడ్రా కమిషనర్ రంగనాథ్

పనులను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: నాలాలు, వరద కాలువల్లో పేరుకుపోయిన పూడికను పూర్తి స్థాయిలో తొలగిస్తే.. వర్షాకాలం నివాసాలను వరదలు ముంచెత్తవని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు. నాలాల్లో పూడిక తీయడానికి ఎక్కడైనా ఇంటి వాకిలి అడ్డుగా ఉండి.. తప్పనిసరి పరిస్థితుల్లో తొలగించాల్సి వస్తే వెంటనే ఆపని పూర్తిచేసి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. అప్పుడే ప్రవాహానికి ఆటంకం తొలగుతుందన్నారు. నగరంలో ప్రస్తుతం జరుగుతున్న డీ సిల్టింగ్ పనులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రహ్మత్‌నగర్, కృష్ణానగర్, అమీర్‌పేట, గాయత్రినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. నాలాలు, వరద కాలువల్లో డీసిల్టింగ్ పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే వర్షాకాలంలో ఎక్కడ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అందుకు గల కారణాలను, పరిష్కార మార్గాలను స్థానికులతో చర్చించి అధికారులకు సూచనలు చేశారు. వేసవి కాలం ఇదే మంచి అవకాశం వర్షాలు మొదలైన తర్వాత పెద్ద పనులు చేయలేం.. ఈ వర్షాకాలానికి ఎక్కడా వరద ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం ఇవ్వండి..

కృష్ణానగర్, అమీర్‌పేట ఇలా డివిజన్ల వారీ వాట్సాప్ గ్రూపులు పెట్టి డీసిల్టింగ్ పనులు జరుగుతున్న తీరుపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని స్థానిక కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ కోరారు. వర్షాకాలం ఇబ్బందులు పడేవారు మీరు.. సమస్య ఎక్కడుందో మీకు చాలా స్పష్టంగా తెలుస్తుంది. ఆ సమస్యకు కారణం, పరిష్కారం మీకు తెలుసు.. ఆ సమాచారం అధికారులకు చేరవేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. రహ్మత్‌నగర్ వంతెన వద్ద పెద్దమొత్తంలో పూడికను తీయడాన్ని పరిశీలించారు. అలాగే కృష్ణానగర్‌లో వేసవి కాలంలోనే మురుగు రహదారులపైకి రావడాన్ని గమనించారు. ప్రతి వంద మీటర్లకూ పూడిక తీత ఎలా జరుగుతుందనేది స్పష్టత ఉండాలని సూచించారు. ఇప్పుడు పూడికను మొత్తం తొలగిస్తే వర్షాకాలం వరద ప్రవాహానికి ఆటంకాలు లేకుండా ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న డీసిల్టింగ్ పనుల్లో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తినా..కావాల్సి న మిషనరీ అవసరమైనా వెంటనే ఆ విషయాన్ని తమ దృష్టికి తీసుకువస్తే సమకూర్చుతామని.. అక్కడ పనులు పర్యవేక్షిస్తున్న జీహెచ్ ఎంసీ, జల మండలి అధికారులకు సూచించారు. డీఆర్ఎఫ్ సిబ్బంది మీ వెన్నంటే ఉంటారని.. పనులకు ఆటంకం కలగకుండా సహకరిస్తారని చెప్పారు.

మంటలను ఆర్పుతున్న అగ్నిప్రమాద సిబ్బంది

గంపలబస్తీలో ఘోర అగ్నిప్రమాదం

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : జీడిమెట్ల పారిశ్రామికవాడలోని రంగారెడ్డినగర్ గంపలబస్తీలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గోడౌన్‌లో జరిగిన ఈ ప్రమాదం ఒక్కసారిగా అక్ర మంగా నిర్వహిస్తున్న సాల్వెంట్స్ ఉవ్వెత్తున ఎగిసిపడటంతో తీవ్ర ఆందోళన చోటుచేసుకుంది. గురువారం ఉదయం ఏడున్నర గంటల సమయంలో ఈ అగ్నిప్రమాదం చోటుచేసుకోవడం గోడౌన్‌లో కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటన వివరాలు ఇలాఉన్నాయి. జీడిమెట్ల పారిశ్రామికవాడను ఆనుకుని ఉన్న రంగారెడ్డినగర్ గంపలబస్తీలో అక్రమంగా నిర్వహించే కెమికల్ సాల్వెంట్స్ గోడౌన్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే స్థానికులు 100కు ఫోన్‌చేయడంతో వారు ఫైర్ ఇంజన్లకు సమాచారం అందించారు. నగరంలోని కూకట్‌పల్లి, కంటోన్మెంట్, సికింద్రాబాద్, సనత్‌నగర్, జీడిమెట్ల పారిశ్రాకవాడల నుంచి ఆరు ఫైర్ ఇంజన్లు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న మంటలను ఆర్పివేశాయి. సమీపంలోని హానుమాన్ ఫ్యాబ్రికేషన్‌తోపాటు మరో స్క్రాబ్ గోదాము, మరో పరిశ్రమలను మంటలు చుట్టుముట్టాయి.అగ్నిప్రమాద సమయంలో పెద్ద ఎత్తున పేలుళ్ల సంభవించే ప్రమాదం ఉండటంతో చుట్టుపక్కల ప్రజలు ఒక్క ఉదుటున ఇళ్లనుంచి బయటకు పరుగులు తీశారు. అక్రమంగా నిర్వహిస్తున్న సాల్వెంట్ గోడౌన్‌లో భద్రత ప్రమాణాలు పాటించకపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుని ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే జీడిమెట్ల పోలీసు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న బాలానగర్ సహాయ పోలీసు కమిషనర్ మాట్లాడుతూ మంటలు వ్యాపించకుండా ముందు జాగ్రత్తలు చేపట్టి మంటలను అదుపులోకి తెచ్చామని తెలిపారు. ఎన్‌డిఆర్ఎఫ్, హైడ్రా, ఫైర్ విభాగాలకు సహకారంతో మంటలకు అదుపులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణం షార్ట్‌సర్క్యూట్ కారణమా లేక కెమికల్ రియాక్షనా అనే కోణాలలో అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ మేరకు జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ఆధ్వర్యంలో సబ్‌ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

ఉప్పల్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : ఉప్పల్ బీరప్పగడ్డలో శ్మశానవాటికలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఒక వ్యక్తి మృతదేహాన్ని ఉప్పల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వినయ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ బీరప్పగడ్డలోని కమ్మరి కులస్థుల స్మశాటికలో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం లభ్యమైంది. మృతుడు సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, బ్లూ కలర్ జీన్స్ పాయింట్, గ్రే కలర్ షర్టు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తి అయి ఉండవచ్చుని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఉప్పల్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ వినయ్ కోరారు

ఆర్టీసీ బస్సు ఢీకొని పారిశుధ్య కార్మికురాలి మృతి

హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: విధులు ముగించుకొని నడుచుకుంటూ వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని పారిశుధ్య కార్మికులు మృతి చెందిన విషాదఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మూసారాంబాగ్ సిరిపిరం కాలనీకి చెందిన పుష్ప(50) అంబర్‌పేట అలీకేఫ్ దుర్గానగర్ ప్రాంతంలో పారిశుధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తుంది. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం 12.30 సమయంలో పారిశుధ్య పర్యవేక్షకుడికి ఫొటోతోపాటు హాజరు వేయించు కొని విధులు ముగించుకుంది. అదే సమయంలో ఇంటికి వెళ్లేందుకు అలీకేఫ్ చౌరస్తాలోని బస్సు స్టాపుకు వెళ్లేందుకు నడుచుకుంటూ వెళ్తుండగా దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన(ఏపీ29జెడ్3048) ఆర్టీసీ బస్సు అంబర్‌పేట నుంచి గోల్నాక వైపు వేగంగా మలుపు తీసుకుంటున్న క్రమంలో పుష్పను ముందునుంచి ఢీకొంది. ముందు చక్రం పుష్పపై వెళ్లడంతో తీవ్రగాయాలతోపాటు తల భాగం నుజ్జునుజ్జు కావడంలో ఆమె అక్కడి కక్కడే మృతి చెందింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు బాధితిరాలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పుష్ప మృతితో అంబర్‌పేటలో ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. పుష్ప కుటుంబానికి న్యాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ తోటి కార్మికులతో పాటు స్థానిక నాయకులు ఆందోళన చేయగా, పోలీసులు కలగచేసుకొని శాంతింపచేశారు.



సంఘటనా స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

బైక్‌లో చెలరేగిన మంటలు, తృటిలో తప్పిన ప్రమాదం

కార్వాన్, ఏప్రిల్ 9(ప్రభాతవార్త): టోలిచౌకి ప్రధాన రహదారిపై వెళు తున్న ఒక ద్విచక్ర వాహనంలో గురువారం అకస్మాత్తుగా మంటలు చెల రేగాయి. అప్రమత్తమైన వాహనదారుడు వెంటనే వాహనాన్ని వదిలి సమీపంలోని దుకాణం నుంచి నీళ్ల తెచ్చి స్థానికుల సహాయంతో మంట లను అదుపులోకి తెచ్చాడు. తృటిలో తప్పిన ప్రమాదంతో జనం ఊపిరి పీల్చుకొన్నారు.

దుకాణదారుడికి ట్రేడ్ లైసెన్సు తప్పనిసరి

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

క్షేత్రస్థాయిలో సమస్యలపై స్పందిస్తున్న ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త మల్కాజ్‌గిరి నగరపాలక సంస్థ (ఎంఎంసి) కమిషనర్ గురువారం విస్తృతంగా పర్యటించి నేరుగా సమస్యలు తెలుసుకొని పలు సూచనలు అందజేశారు. కుషాయిగూడ, వైష్ణవి ఎన్‌క్లేవ్, సాధన విహార్‌కాలనీ, భవానినగర్, శ్రీరామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కుషాయిగూడ రోడ్ నెం.5 ప్రాంతంలో పర్యటించిన కమిషనర్ కిరాణ దుకాణదారులతో మాట్లాడి ట్రేడ్ లైసెన్సులను పరిశీలించి, ప్రతి దుకాణం ముందు లైసెన్స్ వివరాలను స్పష్టంగా కనిపించేలా బోర్డులపై ప్రదర్శించాలని ఆదేశించారు. అలాగే శానిటేషన్ సిబ్బందికి రోడ్ల పక్కన శుభ్రతను మరింత మెరుగుపరచాలని సూచించారు. చెత్త, వ్యర్థాలను వెంటనే తొలగించి, తక్కువ ఎత్తులో ఉన్న మట్టి గుంతలను సరిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పైప్‌లైన్‌తో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించి, రెండు నెలల్లో పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో కమిషనర్ పర్యటించి నిర్మాణంలో ఉన్న యానిమల్ కింగ్ డమ్ థీమ్ పార్క్ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ పార్క్‌లో ప్లే ఏరియా, అంఫితియేటర్, క్యాంటీన్, సర్వెంట్ రూమ్, టూల్ రూమ్‌తోపాటు విస్తృతంగా పచ్చదనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా కొన్ని మొక్కల నాటడానికి ప్రణాళిక సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌ను మే 15 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు. మారుతినగర్ ఎన్‌క్లేవ్ పార్క్‌లో స్థానికులు స్థానిక సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.వెంటనే చెత్తను తొలగించి, చెట్లను క్రమబద్ధంగా కత్తిరించాలని, విభాగాల మధ్య సమన్వయం పెంచి భద్రత మరియు స్పష్ట మైన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. సాధన విహార్ కాలనీలో కమిషనర్ పర్యటించగా డ్రైనేజీ డీసిల్టింగ్ పనుల పురోగతిపై అధికారులు వివరించారు. దశలవారీగా, సక్రమ పద్ధతిలో ఈ పనులు కొనసాగుతున్నాయని, పెండింగ్‌లో ఉన్న అన్ని డీసిల్టింగ్ పనులను మే నెలాఖరుకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా సాధన విహార్ కాలనీలో, మాన్యువల్ క్లీనింగ్ కష్టమైన ప్రాంతాల్లో పనులను వేగవంతం చేయడానికి మెషిన్ల సహాయంతో మెకానికల్ డీసిల్టింగ్ కొనసాగుతున్నట్లు వివరించారు. భవాని నగర్ కాలనీలో పర్యటనలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న మెయింటెనెన్స్ చెల్లింపులు, ఆర్థిక అనుమతుల్లో ఆలస్యం, సీనియర్ సిటిజన్ ఐడీ కార్డుల అవసరం వంటి సమస్యలను వారు ప్రస్తావించారు. ప్రతి నెలా సమావేశాలు, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలియజేస్తూ, దరఖాస్తుల త్వరిత పరిష్కారం బస్ ఫేర్ రాయితీల కోసం మద్దతు కోరారు. ఈ అంశాలపై త్వరితగతిన చర్యలు తీసుకుని, పెండింగ్ చెల్లింపులు క్లియర్ చేయడం, ఐడీ కార్డుల జారీ,పై స్థాయి అధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

16 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు...

మల్కాజ్‌గిరి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 99 రోజుల కార్యాచరణ - ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 35వ రోజు ప్రభుత్వ ఆదేశాల మేరకు మురికి వాడల్లో విస్తృతంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆరోగ్య సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా 16 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శిబిరాల్లో 740 మంది ప్రజలు పాల్గొని, ఉచితంగా వైద్య సేవలను వినియోగించుకున్నారని ఎంఎంసి అదనపు కమిషనర్ రఘుప్రసాద్ తెలిపారు.

ప్రత్యేక నిపుణుల వైద్య బృందాలు ప్రతి శిబిరంలో పాల్గొని, రోగులను పరిశీలించి, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తగిన సలహాలు ఇవ్వడంతో పాటు, ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది.

మాట్లాడుతున్న సిఎంసి కమిషనర్ జి.సృజన

బిల్డర్లు నిబంధనలు పాటించాలి

భద్రతా చర్యలు, కాలుష్య నివారణ చర్యలు తప్పనిసరి

-సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన

హైదరాబాద్, ఏప్రిల్ 9,ప్రభాతవార్త: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న, రాబోయే అన్ని ప్రాజెక్టులలో నిర్మాణ నిబంధనలు, పర్యావరణ ప్రమాణాలు చట్టబద్ధమైన నిబంధనలను పాటించాల్సిందేనని సీఎంసీ కమిషనర్ సృజన స్పష్టం చేశారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ అధ్యక్షతన నరేడ్కో, క్రెడాయ్ ప్రతినిధులు, తెలంగాణ డెవలపర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వ్యక్తిగత బిల్డర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ సృజన మాట్లాడుతూ బిల్డర్లు డెవలపర్లు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని అన్నారు. నిర్మాణ ప్రాంతాలలో తగిన భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలని, దుమ్ము కాలుష్యాన్ని అదుపు చేయడానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి అవసరమైన చర్యలను అమలు చేయాలని కోరారు. నిర్మాణ కార్యకలాపాలు నిర్ణీత నిబంధనలకు లోబడి ఉండాలని, తద్వారా శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాలన్నారు. అలాగే మంజూరైన ప్లాన్ ప్రకారం భవన నిర్మాణం పూర్తయిన తర్వాత మాత్రమే పాక్షిక ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ (పార్షియల్ ఓసీ) కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఓసీ జారీ విషయంలో అధికారులకు బిల్డర్లు సహకరించాలని కమిషనర్ కోరారు. జీఓ ఎంఎస్ నెం.168 నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని అన్నారు. నిర్మాణ వ్యర్థాలను ప్రభుత్వం గుర్తించిన అధీకృత ఏజెన్సీలకు మాత్రమే అప్పగించాలి. బిల్డర్లు, అధికారుల మధ్య సమన్వయం అవసరమని, అన్ని ప్రాజెక్టుల్లో అన్ని మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, బాధ్యతాయుతమైన నిర్మాణ పద్ధతులను అనుసరించాలని కమిషనర్ స్పష్టం చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలి

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తుందని రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్‌యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, సీఈవో నిర్మాణ్ ఆర్గనైజేషన్ వారితో కలసి కలెక్టరేట్‌లో సమత కిచెన్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నివర్గాల అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధిగా అభివర్ణించారు. సమాజంలోని వృద్ధులు దివ్యాంగులు అలాగే ట్రాన్స్ జెండర్ లను ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా ఆర్థిక చేయూతతో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అదేవిధంగా, ఆర్థిక పునరావాస పథకం కింద ఆరు మంది ట్రాన్స్‌జెండర్ లబ్ధిదారులకు రూ.75 వేల చొప్పున ఆర్థిక సహాయం చెక్కులను అలాగే ఐదుమంది దివ్యాంగులకు రూ.1,18, 500 విలువగల బ్యాటరీ ఆధారిత వీల్‌చైర్లు అందజేశారు. సమతా కిచెన్‌లో ఆరు మంది ట్రాన్స్‌జెండర్స్ అలాగే ఒక దివ్యాంగుడుకు ఉపాధి కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అన్ని వర్గాలకు సంక్షేమం అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వెనుకబడిన వర్గాల కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్లు సమాజంలో అంతర్భాగమని, వారి సామాజిక స్వీకరణ, గౌరవప్రద జీవనానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమత కిచెన్‌కు ఎంపీ ల్యాడ్స్ నిధులను సహకరిస్తానని తెలిపారు. కలెక్టర్ హరిచందన దాసరి మాట్లాడుతూ నిరంతర సహాయక చర్యలతోపాటు, సమతా కిచెన్ వంటి ఉపాధి ఆధారిత కార్యక్రమాల ద్వారా స్థిరమైన జీవనోపాధిని కల్పించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ఆసక్తికి అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించి, ఉపాధి అవకాశాలను కల్పించడమే తమ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) జితేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, జిల్లా దివ్యాంగులు, వృద్ధులు ట్రాన్స్‌జెండర్ సంక్షేమ అధికారి రాజేందర్, బీసీ సంక్షేమ అధికారి అశన్న, గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ, ఎస్సీ సంక్షేమ అధికారి ప్రవీణ్, మైనారిటీల సంక్షేమ అధికారి ఇలియా అహ్మద్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పవన్ కుమార్, ఏవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెరుగుతున్న భూకబ్జాలు, అవినీతి..

ప్రధానిని కలిసి సిబిఐ విచారణ కోరతాం

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త) : రాష్ట్రంలో భూకబ్జాలు, అవినీతి హద్దుపద్దు లేకుండా పెరిగిపోయాయని, వీటిపై సమగ్ర సిబిఐ విచారణ జరిపించాలని కోరుతూ త్వరలో ప్రధానమంత్రిని కలవనున్నట్లు రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్య క్షులు ఆర్. కృష్ణయ్య వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వంలో కొందరు మంత్రులు, ఐఏఎస్ అధికారులు కుమ్మక్కై రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజ మెత్తారు. 13 ఏళ్లుగా జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరగా లని కృష్ణయ్య డిమాండ్ చేశారు. పదవుల్లో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధుల అక్రమాస్తులపై విచారణ జరిపించాల్సి న అవసరం ఉందన్నారు. 'మిగులు బడ్జెట్‌తో ఉన్న ధనిక రాష్ట్రం నేడు రూ. 10 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. తెచ్చిన అప్పులను సైతం కాంట్రాక్టర్ల పేరుతో కొల్లగొడుతున్నారు' అని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ భూము లను వేలం వేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ భూములను ప్రజా అవసరాలకు, పేదల ఇళ్ల నిర్మాణానికి, బీసీ హాస్టళ్లు, గురుకుల భవనాల కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు. 5 మంది ఉండాల్సి న హాస్టల్ గదుల్లో 20 నుంచి 30 మంది విద్యార్థులు ఉంటున్నారని, ఒకే భవనంలో మూడు హాస్టళ్ల నడుపుతూ విద్యార్థుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా కోట్లాది రూపాయలు అద్దెల రూపం లో చెల్లిస్తున్న ప్రభుత్వం, విద్యార్థులకు స్వంత భవనాలు నిర్మించడంలో విఫలమైందని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నగరంలో సుమారు 6 లక్షల మంది పేదలు అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతుంటే, ప్రభుత్వం భూములను వేలం వేస్తూ కబ్జాదారులకు అమ్ముకోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ భూములను అమ్మే హక్కు ప్రభుత్వానికి లేదని, దీనిపై ప్రజలందరూ తిరుగుబాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రెవెన్యూ అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుమ్మక్కై చేస్తున్న దోపిడీని అరికట్టాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

కార్వాన్, ఏప్రిల్ 9(ప్రభాతవార్త) : కార్వాన్ నియోజకవర్గం జియాగూడ డివిజన్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 2బిహెచ్‌కే ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎంకే ఫంక్షన్ హాల్‌లో విజయ వంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, కాంగ్రెస్ పార్టీ కార్వాన్ ఇన్‌చార్జ్ ఉస్మాన్‌బిన్ మహ్మద్ అల్‌హజ్రీ, ఎస్సీ సెల్ మాజీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ అయిందల మిత్ర కృష్ణ హాజరయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ లబ్ధిదారులకు 2బిహెచ్‌కే ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ఇళ్ల కేటాయింపు ద్వారా పేద ప్రజలకు గౌరవప్రదమైన జీవనం, భద్రత, స్థిర నివాసం కల్పించడంలో ప్రభుత్వం మరో ముందడుగు వేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష ్యంగా పనిచేస్తోందని, ఇలాంటి పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు,వివిధ పార్టీల స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి చర్యలు : ఎమ్మెల్యే

అంగన్‌వాడీ టీచర్లకు సెల్‌ఫోన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ టీచర్లకు సెల్‌ఫోన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ, అంబర్‌పేట్ నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలోని 34 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల మెరుగుదలతో పాటు చిన్నారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించామని చెప్పారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతి కేంద్రంలో చిన్నారులకు ప్రీస్కూల్ విద్యతోపాటు పోషకాహారం అందించడమే కాకుండా, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని 34 కేంద్రాల్లో ఖాళీగాఉన్న 9 మంది టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే హెల్పర్ల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తున్న సూపర్వైజర్లు శారద, శ్వేతలను అభినందిస్తూ ఎమ్మెల్యే సన్మానించారు. అంగన్వాడి కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని టీచర్లకు హామీ ఇచ్చారు.

కొంపల్లి సర్కిల్‌లో కమిషనర్ సృజన తనిఖీలు

కొంపల్లి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన కొంపల్లి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలను గురువారం పరిశీలించి, సమస్యల పరిష్కారంపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా దుకాణదారులు దుకాణాల వద్ద చెత్తబుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఫాక్స్ సాగర్ సరస్సును పరిశీలించిన ఆమె, సరస్సులో విస్తరించిన వాటర్ హయాసింత్‌ను 10 రోజుల్లో పూర్తిగా తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జయభేరి కాలనీలో నీటి నిల్వ సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి ఇంజినీరింగ్ విభాగం తక్షణమే ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. అలాగే ఓవర్ హ్యాంగింగ్ కేబుల్ల సమస్యపై సంబంధిత విభాగాలతో సమన్వయం చేసి శాశ్వత పరిష్కారం తీసుకురావాలని ఆదేశించారు. పార్కులు, ఖాళీ స్థలాలను పరిశీలించిన కమిషనర్, ప్రాథమిక సదుపాయాల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను సూచించారు. తనిఖీలో కొంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. కృష్ణరెడ్డి, ఎస్‌డబ్ల్యూఎం డీఈఈ ఎం. తిరుపతి, మెయింటెనెన్స్ డీఈఈ విరాట్ రాజ్, ఎస్‌డబ్ల్యూఎం ఏఈ కృప, టీపీఓ జి. వాణి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ నేత శ్రీనివాస్‌కు దళితరత్న అవార్డు

దళితరత్న అవార్డుతో ఎంఆర్‌పిఎస్ ప్రతినిధులు

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ఎస్సీ వర్గీకరణకు కృషిచేస్తున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు ఎస్.కె.శ్రీనివాస్‌మాదిగ బాబుజగ్జీవన్‌రామ్ జయంతి రోజున దళిత అవార్డును 2026 అందుకున్నారు. పలువురు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ప్రతినిధులు శ్రీనివాస్‌ను అభినందించారు. ఈ సందర్భంగా గోషామహల్ నియోజకవర్గం ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు రవి మాదిగ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ ఉద్యమంతోపాటు అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న శ్రీనివాస్‌మాదిగకు, జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా దళితరత్నా అవార్డు అందుకోవడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు శివమాదిగ తదితరులు పాల్గొన్నారు.

గాజుల రామారం సర్కిల్‌లో ఆక్రమణల తొలగింపు

జీడిమెట్ల, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : గాజులరామారం సర్కిల్ పరిధిలోని షాపూర్ నగర్ నుండి సూరారం వరకు ఉన్న ప్రధాన రహదారిపై అక్రమ ఆక్రమణలను గురువారం అధికారులు తొలగించారు. సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది సహాయంతో ఈ చర్యలు చేపట్టినట్లు ఉప కమిషనర్ శ్రీపాద రామేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా సూరారం పోలీస్ స్టేషన్ సమీపంలోని ఒక గ్రానైట్, మార్బుల్ షాప్ యజమాని ఫుట్‌పాత్‌ను ఆక్రమించినందుకు రూ.25,000 జరిమానా విధించి వసూలు చేశారు. రహదారులపై అక్రమ ఆక్రమణలు చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉప కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఏసీపీ సుమిత్ర, టీపీఎస్ మహేందర్, ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

బేగంపేటలో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగింపు

100పైగా ఆక్రమణలు కూల్చివేత.. ఏళ్లతరబడి ఆక్రమణలలో ఉన్న ఫుట్‌ఫాత్‌లకు మోక్షం

బేగంపేటలో జెసిబిల సహాయంతో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

బేగంపేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: బేగంపేటలో ఎన్నో ఏళ్లుగా ఆక్రమణలకు గురైన ఫుట్‌పాత్‌లకు అధికారులు విముక్తి కల్పించారు. రహదారి, ఫుట్‌ఫాత్‌లపైఉన్న ఆక్రమణలను తొలగించేందుకు గురువారం ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ,అధికారుల ఆధ్వర్యంలో భారీ డ్రైవ్ చేపట్టారు. బేగంపేట ప్రధాన రోడ్డుపై నుంచి ఫతేనగర్ రోడ్డు వెళ్లే మార్గంలో ఇరువైపులా ఉన్న ఫుట్‌ఫాత్, రోడ్డు ఆక్రమణలను జేసీబీల సహాయంతో తొలగించారు. శ్యాంలాల్ బిల్డింగ్ ఆర్బీఐ ఫుట్‌ఫాత్‌పై ఎన్నో ఏళ్లుగా డబ్బా రాయుళ్ల కబ్జా చెరలో చిక్కిన ఫుట్‌ఫాత్‌లకు విముక్తి కల్పించారు. శ్యాంలాల్ బిల్డింగ్, ప్రకాష్‌నగర్, మయూరి మార్గాలలో సుమారు 100కు పైగా ఆక్రమణలను అధికారులు కూల్చివేశారు. బేగంపేట లా అండ్ ఆర్డర్ పోలీసుల పర్యవేక్షణలో భారీ సిబ్బంది, జేసీబీలతో ఆక్రమణలు కూల్చివేసారు. కూల్చివేతలు చేపట్టిన సందర్భంగా కొన్నిచోట్ల కొంత ఉద్రిక్తత చోటు చేసుకున్నప్పటికీ అధికారులు ఆక్రమణలు తొలగించారు. ఎన్నో ఏళ్లుగా ఫుట్‌ఫాత్‌లను నమ్ముకుని జీవనం సాగిస్తున్నామంటూ కొందరు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అయినా అధికారులు కూల్చివేతలను కొనసాగించారు. మల్కాజ్‌గిరి ట్రాఫిక్ డీసీపీ 1 కె.రాహుల్‌రెడ్డి పర్యవేక్షణలో అల్వాల్ సర్కిల్ అసిస్టెంట్ టౌన్ ప్లానర్ శ్రీనివాస్‌రెడ్డి బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు బేగంపేట ఇన్స్‌పెక్టర్ సైదులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జానకిరాములు తదితరులు కూల్చివేతలను పరిశీలించారు. రహదారులపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించే విధంగా ఉన్న ఆక్రమణలను తొలగించామని, ఎన్నో ఏళ్లుగా ఫుట్‌ఫాత్‌లను ఆక్రమించి ఏర్పాటుచేసిన డబ్బాలను తొలగించామని ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు తెలియజేసారు. మరికొన్ని ప్రాంతాల్లో ఉన్న ఫుట్‌ఫాత్, రోడ్డు ఆక్రమణలనూ త్వరలో తొలగించి ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు మార్గం సుగమం చేస్తామని శంకరరాజు తెలియజేసారు.

చిరు వ్యాపారులను రోడ్డున పడేశారు

బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పొన్నబోయిన

బేగంపేటలో ఎన్నో ఏళ్లుగా ఫుట్‌ఫాత్‌లపై డబ్బాలు ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తున్న చిరువ్యాపారులను అధికారులు కూల్చివేసివారిని రోడ్డున పడేశారని బేగంపేట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పొన్నబోయిన సురేష్‌యాదవ్ ఆరోపించారు. ఆక్రమణల్లో నష్టపోయిన చిరు వ్యాపారులకు మద్దతుగా కూల్చివేతలు జరిగిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వారికి ప్రత్యామ్నాయం చూపకుండా ఆక్రమణల పేరుతో అధికారులు కూల్చివేతలు చేపట్టడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ప్రతిసారి చిరు వ్యాపారుల పైనే అధికారులు ప్రతాపం చూపుతున్నారని, నష్టపోయిన వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలని లేదంటే వారిపక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని, సురేష్ యాదవ్ హెచ్చరించారు.

ప్రతిజ్ఞ చేస్తున్న డిఐజిపి ఉదయభాస్కర్ భిల్లా, ఉన్నతాధికారులు తదితరులు

శౌర్య దివస్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

- డిఐజిపి ఉదయ భాస్కర్ భిల్లా

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : 61వ 'శౌర్య దినోత్సవాన్ని (శౌర్య దివస్) గురువారం సీఆర్‌పీఎఫ్ హైదరాబాద్, చాంద్రాయణగుట్ట గ్రూప్ సెంటర్లో ఘనంగా జరుపుకున్నారు. సీఆర్‌పీఎఫ్ డిఐజిపి ఉదయభాస్కర్ భిల్లా అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. క్వార్టర్ గార్డ్ వద్ద జవాన్ల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సీఆర్‌పీఎఫ్ మెన్స్ క్లబ్‌లో ఒక ప్రత్యేక సైనిక సమ్మేళనం నిర్వంచారు. ఈ సందర్భంగా డిఐజిపి ఉదయ భాస్కర్ భిల్లా మాట్లాడుతూ ఏప్రిల్ 9, 1965 ప్రాముఖ్యతను వివరించారు. పాకిస్తాన్ సైన్యానికి చెందిన 3500 మంది బలగాలు గుజరాత్‌లోని రాన్ ఆఫ్ కచ్‌లోని సర్దార్ పోస్ట్‌పై "డెసర్ట్ హాక్" ఆపరేషన్‌ను ప్రారంభించిందన్నారు. అక్కడ మోహరించిన సీఆర్‌పీఎఫ్ బలగాలు చాకచక్యంగా వ్యవహరించి వారిని ధైర్యంగా ఎదుర్కొన్నట్లు వివరించారు. పాకిస్తాన్ బలగాలకు ధీటైన జవాబు ఇస్తూ భారత సైన్యం వచ్చే వరకు ఆ స్థావరాన్ని తమ ఆధీనంలో ఉంచుకున్నారన్నారు. సీఆర్‌పీఎఫ్ ప్లాటూన్ యొక్క ధైర్యసాహసాలను పునరుద్ఘాటించారు. జవాన్లు ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా వీరనారి, విశిష్ట విజేతలను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. అనంతరం సైనిక్ సమ్మేళనానికి హాజరైన అధికారులు, సిబ్బందితో శౌర్య దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. 1965 ఏప్రిల్ 9న తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాన్ని మరోసారి స్మరించుకున్నారు. కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ ఉన్నతాధికారులు, అధికారులు, జవాన్లు పాల్గొన్నారు.

20న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వార్షికోత్సవాలు

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : చాంద్రాయణగుట్ట కేశవగిరి శ్రీ భ్రమరాంబదేవి సమేత శ్రీ చెన్నమల్లిఖార్జున స్వామి దేవస్థానం ఆవరణలోని శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం 5వ వార్షికోత్సవాలను ఈనెల 20వ తేదీ సోమవారం నిర్వహించనున్నట్లు ఆ ఆలయ నిర్వాహకులు కోటి హరీష్ కుమార్ తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజ, 8.30గంటలకు గణపతి పూజ, పుణ్యహవాచనం, పంచగవ్యారాధన, మండపపూజ, సహస్ర లింగార్చన, ఉదయం 9గంటలకు గణపతి హోమం, నవగ్రహ హోమం, రుద్రహోమం, అత్యంత శక్తివంతమైన రాజ శ్యామల యాగం, శ్రీ వీరభద్ర మూలమంత్ర హోమం, మూర్తి హోమం, శాంతి హోమం, పాశుపతాది అస్త్రమంత్ర హోమాలు, మహా పూర్ణాహుతి, మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ స్వామివారికి స్నపనోత్సవం, విశేష ద్రవ్యాలతో అభిషేకములు (ఏకాదశ రుద్ర వారాభిషేకాలు), అలంకరణ, బహువిధ పుష్పపూజ, నీరాజనం, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 4గంటలకు శ్రీ వీరభద్ర స్వామికి గండదీప సేవ, సాయంత్రం 5గంటలకు శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి కల్యాణోత్సవం, ప్రస్థయం, నంది కోలసేవ, రాత్రి 8గంటలకు స్వామి అమ్మవార్ల భవ్యమైన పల్లకి సేవ ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివార్ల కృపకు పాత్రులు కాగరని కోరారు.

ఏప్రిల్ 20 నుంచి మే 23వ తేదీ వరకు సంగీతంలో శిక్షణ

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో ఏప్రిల్ 20వ తేదీ నుంచి మే 23వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తరగతులను నిర్వహించబోతున్నట్లు అకాడమి వ్యవస్థాపక డైరెక్టర్ జి.వసుధామూర్తి, వ్యవస్థాపక ప్రిన్సిపాల్ జి.లక్ష్మణమూర్తి వివరించారు. ఇతర వివరాలకు 8374927736 సంప్రదించవచ్చన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అన్నమయ్య కీర్తనలు,రామదాసు కీర్తనలు, భజన్‌లు, మంగళ హారతులు, ఇతర ఆధ్యాత్మిక పాటలు, కీబోర్డు, ప్లానో, బేసిక్స్, సాంగ్స్, భజన్‌లలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. కాగా మే 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు అన్నమయ్య జయంతి ఉత్సవాలను నిర్వహించబోతున్నట్లు వివరించారు.

రూ. 14 లక్షల ఆభరణాలు

చోరీ చేశాడు..చెత్తలో దాచాడు

నిందితుడు ఆనంద్‌కుమార్

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : యజమాని ఇంట్లో చోరి చేసిన దాదాపు రూ. 14 లక్షల విలువైన బంగారు ఆభరణాలను చోరి చేసిన పని మనిషి తన ఇంట్లో మూలకు ఊడ్చిన చెత్తలో దాచిన సంఘటన జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ డిఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 25లో ఎన్ఆర్ఐ అయిన అమీనుల్లా ఖాన్(70) తన భార్య షరీఫా అజియాతో కలిసి నివసిస్తున్నాడు. అతని ఇంట్లో గుడ్డు, ఆనంద్ అనే ఇద్దరు పనిచేస్తున్నారు. ఇంట్లో పెట్టిన వజ్రపు ఉంగరం తోపాటు మరికొన్ని వజ్రపు ఆభరణాలు కనిపించడం లేదని మార్చి 31న జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే విచారణ చేపట్టిన పోలీసులు తొలుత గుడ్డు పనిమానివేయడంతో అతన్ని అనుమానించి విచారిం చారు. అనంతరం ఆనంద్‌కుమార్‌ను విచారించిన పోలీసులకు అతనిపై అను మానం వచ్చింది. దీంతో బోరబండలో ఉన్న అతని ఇంటిని మొత్తం తనిఖీ చేశారు. ఇళ్లంతా వెదికినా ఆభరణాలు కనిపించలేదు. అదే సమయంలో ఇంట్లో ఒక మూలకు చెత్త పేరుకు పోయి ఉండటాన్ని పోలీసులు గమనించారు. చెత్తను తొలగించి చూడగా అందులో దాదాపు 13 గ్రాములున్న రెండు వజ్రపు ఉంగరాలు లభ్యమయ్యాయి. దాదాపు రూ. 14 లక్షల విలువైన వజ్రపు ఉంగరాలు చెత్తలో లభించడంతో పోలీసులు ఒక్కసారిగా కంగుతిన్నారు. నిందితుడిని విచారించగా తాను దొంగిలించిన తరువాత వాటిని విక్రయించలేక, భయంతో చెత్తలో పడేసినట్లు తెలిపారు. చెత్తపడేయకుండా రోజు అక్కడ పేర్చినట్లు వివరించారు. నిందితుడిని బీహార్‌లోని మధుబని జిల్లా బైనిపతి గ్రామానికి చెందిన ఆనంద్ కుమార్ అలియాస్ ఆందన్ ముకియా(32)గా గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

అయిదేళ్ల తరువాత ఫోన్ ఆన్ చేశాడు.. పోలీసులకు చిక్కాడు

- హనీట్రాప్ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు

నిందితుడు సూరజ్‌శర్మ

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : హనీట్రాప్ కేసులో అయిదేళ్ల తరువాత ఫోన్ ఆన్ చేసిన ఒక నిందితుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ డిఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. జూబ్లీ హిల్స్ ప్రాంతంలో నివసించే ఒక వ్యాపారి భార్య(35)కు 2022లో ఫేస్‌బుక్ ద్వారా ఒక వ్యక్తి పరిచయమయ్యాడు. తనను తాను సూరజ్‌శర్మ అలియాస్ అశోక్‌శర్మగా పరిచయం చేసుకొన్నాడు. తాను పెద్ద వ్యాపారవేత్తేనని, సాఫ్ట్‌వేర్ సంస్థలున్నాయని ఆమెను నమ్మించాడు. తనకు ఆధ్యాత్మిక శక్తులు ఉన్నాయని, ఆరోగ్యానికి, పిల్లల అభివృద్ధికి ఉపయోగపడుతాయని చెబుతూ ఆమెను తన ముగ్గులోకి దించాడు. అప్పటికే వివాహమై పిల్లలున్న ఆమె పూర్తిగా అతని ట్రాప్‌లో పడింది. దీంతో ఇద్దరు ఫోన్ నంబర్లు మార్చుకోవడంతోపాటు ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఆమెను నమ్మించి దాదాపు కోటి రూపాయల మేర బంగారు ఆభరణాలను, నగదును తీసుకున్నాడు. ఆమెకు బబ్బులు అవసరం అంటే ఒక రూ. 25వేలు ఇచ్చి ఆ మహిళకు మరింత దగ్గరయ్యాడు. కొద్ది రోజుల తరువాత ఆమెను దూరం పెట్టడమే కాకుండా ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పెడుతానంటూ బెదిరించాడు. అనంతరం సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి అందుబాటులో లేకుండా పోయాడు. ఈ క్రమంలోనే మహిళ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా నవంబరు 2022లో పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతున్న సూరజ్ శర్మ తాజాగా తన పాత ఫోన్ నంబరును ఉపయోగించాడు. అంతేకాకుండా ఫేస్‌బుక్‌లో యాక్టివ్ అయ్యాడు. దీంతో క్రైం పోలీసులు అతని కదలికలపై దృష్టి పెట్టి కాచిగూడలో ఉన్న అతన్ని అరెస్ట్ చేశారు. సూరజ్ శర్మ అసలు పేరు నితిన్ ధైమగా గుర్తించారు. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ముదిరాజ్ భవనం నిర్మాణం చేపడతాం

కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

హైదరాబాద్, ఏప్రిల్ 9,ప్రభాతవార్త: ముదిరాజ్‌ల గౌరవాన్ని కాపాడటంలో ప్రభుత్వం రాజీపడదని... ఆత్మగౌరవ భవనం అంశంలో జరిగిన అన్యాయాలకు చెక్‌పెట్టి నిర్మాణం చేపడతామని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో వివిధ ముదిరాజ్ సంఘాల ప్రముఖులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ, ముదిరాజ్ ఆత్మగౌరవ భవన నిర్మాణం విషయంలో గతంలో ట్రస్ట్ పేరుతో జరిగిన అవకతవకలు పూర్తిగా బహిర్గతమయ్యాయన్నారు. ముదిరాజ్ సమాజ గౌరవాన్ని దెబ్బతీసేలా జరిగిన ప్రతి అక్రమంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ముదిరాజ్ ఆత్మగౌరవాన్ని ఎవరూ తాకట్టు పెట్టలేరన్నారు. గతంలో కొంత మంది వ్యక్తిగత ప్రయోజనాల కోసం ట్రస్ట్‌ను దుర్వినియోగం చేసి సమాజాన్ని మోసం చేశారని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.. గత ప్రభుత్వంలో కోకాపేట్ వద్ద కేటాయించిన ఐదు ఎకరాల స్థలంలో భవన నిర్మాణం కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు, ఇది ముదిరాజ్ సమాజ ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. ప్రభుత్వం దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని వేగంగా పూర్తి చేయడానికి కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ రూ. 5 కోట్ల నిధులను విడుదల చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. అలాగే ముదిరాజ్ కులాన్ని బీసీడి నుంచి బీసీఏ లోకి మార్చే అంశంపై త్వరలోనే ముదిరాజులు ఒక శుభవార్త వినబోతున్నారని ఆయన ప్రకటించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంలో ప్రభుత్వం కట్టుదిట్టంగా పనిచేస్తోందని, మాట తప్పని ప్రభుత్వంగా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డిసిసి ప్రెసిడెంట్ రోహిత్‌ముదిరాజ్, మనముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్, డా మద్దెల సంతోష్‌ముదిరాజ్, అందే బాబుముదిరాజ్, బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ సామల హేమ, దీపికాముదిరాజ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా కార్యదర్శిగా దేవీవరప్రసాద్

ముషీరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా కార్యదర్శిగా భోలక్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు జి.దేవీప్రసాద్ నియమితులయ్యారు. గురువారం టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు దీపక్‌జాన్ వరప్రసాద్‌కు నియామక పత్రం అందచేశారు. ఈ మేరకు భోలక్‌పూర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వరప్రసాద్ మాట్లా దుతూ తనపై నమ్మకం ఉంచి, పార్టీ బాధ్యతలు అప్పగించిన మహేష్‌కుమార్‌గౌడ్‌కు, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌కు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్‌కు జిల్లా అధ్యక్షులు దీపక్‌జాన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్‌లకు ధన్యవాదములు తెలియచేశారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలలో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, పార్టీని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తూ అందరికీ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జగదీష్‌బాబు

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త): కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జవహర్‌నగర్‌కు చెందిన గుండు జగదీష్‌బాబును నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేసారు. ఈ సందర్భంగా గురువారం మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్‌ను, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌ను కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బద్ద మోహన్ రెడ్డి, బండారి నవీన్, రాజేష్, సుబ్బారావు, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిఈఈఏ అధ్యక్షుడిగా శివాజీ..వరుసగా నాల్గోవసారి ఏకగ్రీవం

హైదరాబాద్, ఏప్రిల్ 9,ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన ఇంజనీర్ సంఘం నేత ఎన్.శివాజీ నాల్గవసారి తెలంగాణ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆవిర్భవించిన తెలంగాణ ఇంజనీర్స్ అసోసియేషన్(టీఈఈఏ) తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక భూమిక పోషించింది. 2020 సంవత్సరం నుంచి 2014 సంవత్సరం వరకు రాష్ట్ర సాధన కోసం ఉవ్వెత్తున జరిగిన రాష్ట్ర సాధన ఉద్యమంలో శివాజీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు కీలకభూమిక పోషించారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాత ప్రతి తెలంగాణ ఉద్యోగికి అండగా ఉంటు విద్యుత్ సంస్థలో అందరిలో ఒకడుగా ఉంటు రాష్ట్రంలోనే తనకంటు ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. రాష్ట్రవిభజన తర్వాత సీమాంధ్ర మూలాలు ఉన్న ఉద్యోగులను ఇక్కడి నుంచి పంపించడానికి విశ్వప్రయత్నం చేశారు. సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. తెలంగాణ ఉద్యోగులకు పదోన్నతుల విషయంలో, కొత్త ఉద్యోగ నియామకాలలో టీఈఈఏ తరపున శివాజీ ముఖ్యపాత్ర పోషించారు. ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా విద్యుత్ సంస్థల యాజమాన్యాలతో పోరాడి సమస్యలను సాధించుకున్నారు. టీఈఈఏ అంటే శివాజీ, శివాజీ అంటే టీఈఈఏ అనే స్థాయికి ఎదగడమే కాకుండా అసోసియేషన్‌లో ఉన్న ఐదు వేలకు పైగా ఉన్న సభ్యులతో మమేకమయ్యారు. అందరి వాడుగా ఎదిగిన శివాజీకి వ్యతిరేకంగా టీఈఈఏలో పోటీ చేయడానికి ఎవరు ముందుకు రాలేదు. నాల్గవ సారి కూడా (12 సంవత్సరాలుగా) శివాజీని ఏకగ్రీవంగా ఎన్నుకుని తమ ప్రేమాభిమానాలను చాటుకున్నారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతు తన పట్ల నమ్మకంతో మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందులకు సభ్యులందరికి దన్యవాదాలు తెలిపారు. టీఈఈఏ తెలంగాణ ఉద్యమం నుంచి పుట్టిందని, తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడడమే లక్ష్యంగా ముందుకు వెళ్లడమే టీఈఈఏ లక్ష్యం అన్నారు. టీఈఈఏలో మిగతా పదవుల కోసం పోటీ తీవ్రంగా ఉందని, అందరితో చర్చించి ఏకగ్రీవంగా ముగించడానికి ప్రయత్నిస్తామన్నారు. తప్పని పరిస్థితిలో పోటీ చేసినా ఫ్రెండ్లీ గా ఉండాలని, గెలుపు ఓటములు సహజమని, దానితో నిరాశ చెంది మన సంఘాన్ని మనమే నీరుగార్చే ప్రయత్నం చేసే ప్రయత్నం ఎవరు చేయకూడదన్నారు. భవిష్యత్‌లో అందరికి అవకాశాలు వస్తాయని, అందరం ఒకటిగా పని చేసుకుంటు తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేయాల్సిన అవసరంఉందని శివాజీ సభ్యులకు పిలుపునిచ్చారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీహోదా కల్పించే వరకు ఉద్యమించాలి

కంటోన్మెంట్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: దళిత క్రైస్తవులను ఎస్సీహోదా, ఎస్సీ రిజర్వేషన్లు వర్తించవని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం సరైంది కాదని ఎమ్మెల్సీ, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, బిఆర్ఎస్ నేత రాజీవ్‌సాగర్ తెలిపారు. గురువారం సికింద్రాబాద్ వైఎంసీఏలో క్రైస్తవ నాయకులు, మేధావులు, బిషప్‌లు, పాస్టర్లు నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి వారు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. హిందూ మతం నుంచి క్రిస్టియన్ మతంలో కన్వర్ట్ అయితే వారికి ఎస్సీహోదా కల్పించకూడదని తీర్పు ఇవ్వడం సరైంది కాదన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీహోదా కల్పించే వరకు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సేవా సమితి,ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్,ఆల్ క్రిస్టియన్ వెల్ఫేర్ సెంటర్,క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు పాల్గొని వారి వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బేగంబజార్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: ప్రజలు ఉచిత వైద్యశిభిరం ద్వారా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని పురానాపూల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ కోరారు. అజీజ్ అహ్మద్ చారిట్రబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని సందర్శించి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు,యువజన,సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వైద్య శిబిరాల్లో స్థానిక పరిసర ప్రాంతాల ప్రజలు ముందుకు వచ్చి ఆరోగ్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఖలీల్‌హుల్ రెహ్మాన్,వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాలార్‌జంగ్ మ్యూజియంలో రెండు ఎగ్జిబిషన్లు

మేలో సమ్మర్ ఆర్ట్ క్యాంప్

చార్మినార్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : సాలార్‌జంగ్ మ్యూజియంలో ఈ నెల 14వ తేదీన రుమాలే ప్రత్యేక ఫోటోప్రదర్శనను ఏర్పాటు చేయనున్నామని మ్యూజియం కీపర్ డాక్టర్.నాయక్ తెలిపారు. కర్ణాటకకు చెందిన ప్రముఖ చిత్రాకారులు రూమాలే వేసిన అరుదైన చిత్రాలు ఫోటో ప్రదర్శనలో నెల కొల్పనున్నామని ఆయన తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్, సాలార్‌జంగ్ మ్యూజియం బోర్డు చైర్మన్ శివ ప్రతాప్ శుక్లా 14వ తేదీన ఉదయం 11 గంటలకు రుమాలే ప్రత్యేక ఫోటో ప్రదర్శనను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. కాగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ నెల 13వ తేదీన సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రత్యేక ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఈ ప్రత్యేక ఫోటో ఎగ్జిబిషన్‌లో డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ జీవితానికి సంబంధించిన దాదాపు యానభై చిత్రాలు ఉన్నాయని ఆయన తెలియజేశారు. మే నెలలో పాఠశాలల విద్యార్థుల కోసం సాలార్‌జంగ్ మ్యూజియంలో సమ్మర్ ఆర్ట్ క్యాంప్‌ను నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.

అండర్ 17 మెన్, ఉమెన్ రెజ్లింగ్ పోటీలు ప్రారంభం

గన్‌ఫౌండ్రి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: నగరంలో ఎంతో మంది కుస్తీవీరులను, జాతీయ అంతర్జాతీయ పోటీలకు సిద్ధం చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం హైదరాబాద్ డిస్ట్రిక్ అసోసియేషన్ చైర్మన్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, అధ్యక్షులు సంతోష్ పహిల్వాన్ సంయుక్త ఆధ్వర్యంలో విక్టోరియా ప్లేగ్రౌండ్స్‌లో అండర్ 17–మెన్ అండ్ ఉమెన్, హైదరాబాద్ డిస్ట్రిక్ట్ రెజ్లింగ్ చాంపియన్ షీప్–2026 పోటిలను తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సరైన సౌక ర్యాలు, లేకపోవడం వల్ల యువత ప్రతిభ ఉన్నప్పటికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించలేక పోతున్నారన్నారు. అనంతరం చైర్మన్ గడ్డంశ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ఈ పోటిలో దాదాపు 200 మంది పురుషులు, పాల్గొంటారని వారు తెలిపారు. ఈ పోటిలో గెలుపొందిన విజేతలను ఈనెల 13న జరిగే జాతీయస్థాయి, కుస్తీపోటిలకు పంపించడానికి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో రెజ్లింగ్ డిస్టిక్ సభ్యులు మల్లయోధులు అస్లాం, అర్జున్, లింగం, అభిమన్యు, కిరణ్, కాలియా పహిల్వాన్లు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటిలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్

కమిషనర్ వినయ్ క్రిష్ణారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి

అభివృద్ధికి సహకరించండి: మాజీ కార్పొరేటర్

అల్వాల్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: అపరిష్కృత సమస్యల పరిష్కారానికి సహకరించాలని మాజీ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి మల్కాజిగిరి కార్పొరేషన్ కమిషనర్ వినయ్‌క్రిష్ణారెడ్డిని కోరారు. గురువారం కమిషనర్‌ను ఆమె కార్యాలయంలో కలిసి పలు సమస్యలుపై చర్చించారు. బస్సు షెల్టర్‌లు, దోమలు బెడద, ఎలక్ట్రికల్ పోల్‌లు, బాక్స్ డ్రైన్ సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌ను శాంతి శ్రీనివాస్‌రెడ్డి వినతి పత్రం అందించారు.

అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించినవారిపై చర్యలు తీసుకోవాలి

అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించినందుకు నిరసన తెలుపుతున్న నేతలు

కంటోన్మెంట్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడం సరైందికాదని దళిత సంఘాల నేతలు సంకి రవీందర్, కేడి రమేశ్, రొట్టెల సునీల్ మాదిగ, ఏ.ఎల్.ఆనంద్, పెంట శ్రీహరి, సిపిఎం నేత ఆర్.మల్లేశ్ అన్నారు. గురువారం 5వ వార్డు వాల్మీకినగర్ కమ్యూనిటీ హాల్‌లో వారు మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో 90 శాతం ప్రజలు ఎస్సీ,ఎస్టీ,బీసీ వర్గాలకు చెందినవారని, ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంలో అంబేద్కర్,దళిత జాతిని అవమానపర్చే విధంగా విగ్రహాన్ని తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే స్థలంలో ఈ నెల 14 అంబేద్కర్ జయంతిలోపు అంబేద్కర్ విగ్రహాన్ని పున: ప్రతిష్టించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తు కార్యాచరణ కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన దళిత సంఘాల నాయకులు ఇటుక గోపి, యాదగిరి, సాయికుమార్,మహేష్,కొంపల్లి విజయ్ మాదిగ,విశాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

ఆక్రమణలను తొలగించాలని కాంగ్రెస్ నేత చిన్న శ్రీశైలం యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేపీ జ్ఞానేశ్వర్

యూసుఫ్‌గూడ ఏప్రిల్ 9 ప్రభాతవార్త: డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్‌జీవన్‌రామ్ విగ్రహాల సాక్షిగా కొందరు వ్యాపారం కోసం ఆక్రమణలకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ విగ్రహాల నిర్వాహకులు జేపీ జ్ఞానేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. రహమత్‌నగర్ డివిజన్‌పరిధిలోని ఎస్పీఆర్ హిల్స్ చౌరస్తాలో రెండు దశాబ్దాల క్రితం తాను స్వయంగా అంబేద్కర్, జగ్‌జీవన్ రామ్ విగ్రహాలను ఏర్పాటుచేయటం జరిగిందని, ప్రతి సంవత్సరం జయంతి, వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని, అయితే ఆ విగ్రహాల దిమ్మల చుట్టూ కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని వాటిని తొలగించాలంటూ సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్‌కు వినతిపత్రం అందజేసి కోరారు. అందుకు తగిన విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

డిసిసి జనరల్ సెక్రటరీగా ముద్దారపు శ్రీకాంత్‌గౌడ్

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: టీపీసీసీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్‌ను ముద్దారపు శ్రీకాంత్‌గౌడ్ గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నోసంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్న శ్రీకాంత్‌గౌడ్‌ను సికింద్రాబాద్ డిసిసి జనరల్‌సెక్రటరీగా నియమించినందుకు ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షినటరాజన్, టీపీసీసీ నేత మహేష్‌కుమార్‌గౌడ్, తెలంగాణ క్రిస్టియన్ అండ్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు చెందిన దీపక్ జాన్, పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కోట నీలిమలకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలియజేసిన ఆయన, పార్టీకి మంచి పేరు తీసుకురావడానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

అడ్డగుట్ట అభివృద్ధికి కృషి : లింగాని ప్రసన్న

అభివృద్ధి పనులను ప్రారంబిస్తున్న మాజీ కార్పొరేటర్ లింగాని ప్రసన్న

అడ్డగుట్ట, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సహకారంతో అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని డివిజన్ మాజీ కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆజాద్ చంద్రశేఖర్ నగర్ లో రూ.17 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఆదేశాల మేరకు ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా లింగాని మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని ఇంజనీర్లకు కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, పెండెం మనోహర్, దేవయ్య, మురళీ, కొండయ్య, రమేష్, స్వరూప, కాంగ్రెస్ నాయకులు గంట రాజు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

విజయ గణపతి ఆలయ అభివృద్ధికి రూ.1 లక్ష విరాళం

జీడిమెట్ల, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 132వ డివిజన్ న్యూ వివేకానందనగర్ కాలనీలో నిర్మాణంలోఉన్న శ్రీ విజయ గణపతి ఆలయ అభివృద్ధికి రూ.1,00,000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు జాలిగం రాకేష్ ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేసి, ఆలయ నిర్మాణం త్వరగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు దాస్ గౌడ్, సత్తయ్య గౌడ్, విశాల్, శంకర్, దేవరాజు తదితరులను కలుసుకుని మాట్లాడారు. ఆలయ అభివృద్ధి ద్వారా భక్తి భావం పెంపొందడంతో పాటు సమాజ అభివృద్ధికి దోహదం అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యులకు చెక్కును అందజేస్తున్న రాకేష్

మూడు నెలలకు ఒకసారి ఖైదీలకు వైద్య పరీక్షలు

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా

సైదాబాద్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం చంచల్‌గూడ జైలులో మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జైళ్ల శాఖ, ఆరోగ్య శాఖల మధ్య ఎంఓయు కుదిర్చి రాబోయే రోజుల్లో ప్రతి మూడు నెలలకు ఒకసారి రాష్ట్రంలోని అన్ని జైళ్లలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్డియాలజి, షుగర్, బిపి, ఈఎన్‌టి, రక్త పరీక్షలు, స్కిన్, గైనకాలజి తదితర వైద్య పరీక్షలు అన్నింటిని నిర్వహించడం జరుగుతుందన్నారు. అవసరమైన ఖైదీలకు జిల్లాలోని డి అడిక్షన్ కేంద్రాల్లో వైద్య చికిత్స అందించడం జరుగుతుందన్నారు. జైళ్లలో ఖాళీగా ఉన్న డాక్టర్లు, ఫార్మసిస్టులు, ఎంఎన్‌ఓలు, సైక్రియాట్రిస్టులు వంటి పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని అన్నారు. జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్ర మాట్లాడుతూ త్రైమాసిక వైద్య శిబిరాల ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి సమయానుకూలంగా చికిత్స అందించవచ్చన్నారు.

చంచల్‌గూడ జైలులో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహా

కాగా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో రాష్ట్రంలోని అన్ని 35 జైళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జైళ్ల శాఖ అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సెక్రటరి డాక్టర్ క్రిస్టిన, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎ.నరేంద్రకుమార్,పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ బి.రవీందర్‌నాయక్, వైద్య విధాన పరిషత్ కమీషనర్ డాక్టర్ ఎ.అజయ్‌కుమార్, జైళ్ల శాఖ ఐజి ఎన్.మురళిబాబు, డిఐజి డాక్టర్ డి.శ్రీనివాస్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ ఎన్.శివకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు లాప్‌ట్యాప్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

డిగ్రీ కళాశాలలో నూతన భవనం ప్రారంభం

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : కూకట్‌పల్లిలో డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యార్థుల కోసం నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి ఇన్చార్జి బండి రమేష్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల అదనపు గదుల కోసం మరో కళాశాల కోసం అవసరమైన స్థలాన్ని నిధులను ఏర్పాటు చేయడం జరుగుతుందని హామీఇచ్చారు. అనంతరం విద్యార్థులకు లాప్‌ట్యాప్‌లు అంగన్ వాడీ టీచర్లకు సెల్‌ఫోన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్, డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు, సేవ్ దళ్ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్‌యుఐ ఆవిర్బావ దినోత్సవ వేడుకలు

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : వివేకానందనగర్‌లో ఎన్ఎస్‌యుఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆవిర్బావ దినోత్సవం సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జనరల్ సెక్రెటరీ వంశీ ముదిరాజ్ ఆహ్వానం మేరకు వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోగల బాగ్ అమీర్‌లో జెండాను వివేకానంద నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లం మహేష్, కావేటి నాగార్జున, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ నేత టైగర్ ఆలె నరేంద్ర

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త) : మాజీ కేంద్ర మంత్రి, తెలంగాణ ఉద్యమనేత టైగర్ ఆలె నరేంద్ర వర్ధంతి కార్యక్రమం గురువారం గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, నరేంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ప్రసంగించారు. జనసంఘ్ నేతగా, బిజెపి నాయకుడిగా, తెలంగాణ పోరాట యోధుడిగా ఆలె నరేంద్ర సాగించిన 40ఏళ్ల రాజకీయ ప్రస్థానం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు వి. నవీన్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, దామోదర్, ఉమేష్, బాలకృష్ణ, మహమూద్, సత్తిరెడ్డి, ప్రకాష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ఆనంద్‌రావు, లక్ష్మణ్ యాదవ్, సాయికుమార్, నీరజ్, లావణ్య, సంయుక్తా రాణి, అనుష పాల్గొన్నారు. అలాగే పద్మశాలి సంఘం ప్రతినిధులు రాచ శ్రీనివాస్, వెంకటేష్, రఘునాథ్, పాపయ్య, రమేష్ పాల్గొని నివాళులర్పించారు.

నరేంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి కృషి

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారుగా విఠల్

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త) : ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్య సమాజ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారుగా కొటికె విఠల్ అన్నారు. ఇందుకోసం అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానాని అన్నారు. గురువారం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారుగా కొటికె విఠల్ నియమితులైన సందర్భంగా సంస్థ సీనియర్ సభ్యులు చకిలం రమణయ్య ఆధ్వర్యంలో సత్కరించి ప్రసంగించారు. విఠల్ నియామకం సంస్థ బలోపేతానికి ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టంగుటూరి రామకృష్ణ మాట్లాడుతూ వైశ్య సమాజానికి విఠల్ అందిస్తున్న సేవలు అనన్యసామాన్యమని, వారి కృషిని గుర్తించి ఈ పదవిని అప్పగించడం సంతోషదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో చకిలం రమణయ్యతో పాటు సింగిరికొండ నరసింహ, మదుపల్లి రవి గుప్తా, నేలంటి సత్యనారాయణ, చలపతి రావు, పి.వి. రమణయ్య, ఊర నరసింహ, మంచుకాంతి చిన్న భిక్షమయ్య, కొండూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై ఉక్కుపాదం

ట్రాఫిక్ డిసిపి అవినాష్‌కుమార్

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త) : నగరంలో పాదచారుల భద్రతకు విఘాతం కలిగిస్తూ, ట్రాఫిక్ రద్దీకి కారణమవుతున్న ఫుట్‌పాత్ ఆక్రమణలపై అధికారులు ఉక్కుపాదం మోపారు. ఫుట్ పాత్‌లపై అక్రమాలకు చెక్ పెట్టే దిశగా కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్1 డీసీపీ అవినాష్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్డు ప్రాంతంలో జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక రోప్ డ్రైవ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్ లపై ఆక్రమించి ఏర్పాటు చేసిన షాపుల డబ్బాలు, తాత్కాలిక నిర్మాణాలను సిబ్బంది భారీ యంత్రాలతో తొలగించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ పాదచారుల హక్కులను కాలరాస్తూ ఫుట్పాత్లను వ్యాపారాలకు వాడుకుంటే సహించేది లేదు. ట్రాఫిక్ ఇబ్బందులను నివారించేందుకు ఇటువంటి డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయి. ఆక్రమణల గురించి సమాచారం ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని స్పష్టం చేసారు. అదనపు డీసీపీ (ట్రాఫిక్) రాములు, సికింద్రాబాద్ జోన్ ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, చిక్కడపల్లి, గాంధీనగర్,ఉస్మానియా యూనివర్సిటీ, చిలకలగూడ, కాచిగూడ, మహంకాళి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లు ఏడుకొండలు, డి.వెంకట్ రెడ్డి, కె.సత్యనారాయణ, జగన్ రెడ్డి, కౌశిక్ , శోభన్ కుమార్ తో జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ ఏసిపి శ్రీనివాస్, జిహెచ్ఎంసి డి ఈ గీత తదితర అధికారులు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న డీసీపీ..

ఆక్రమణల తొలగింపు ప్రక్రియ జరుగుతుండగా ఒక అప్రత్యాశిత సంఘటన చోటుచేసుకుంది. విధి నిర్వహణలో ఉన్న ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు ప్రమాదవశాత్తు గాయమై తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన డీసీపీ అవినాష్ కుమార్ తక్షణమే స్పందించారు. అంబులెన్స్ కోసం వేచి చూడకుండా, మానవత్వంతో తన సొంత వాహనంలోనే సదరు సిబ్బందిని ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఆపద సమయంలో ఉన్నతాధికారి చూపిన చొరవను, తోటి సిబ్బంది పట్ల ఆయనకున్న నిబద్ధతను అక్కడున్న వారు ప్రశంసించారు.

ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ డీసీపీ అవినాష్‌కుమార్

నరేంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

ఆలె నరేంద్రకు ఘన నివాళులు

కార్వాన్, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త) : బిజెపి మాజీ ఎమ్మెల్యే, మాజీ పార్లమెంటేరియన్, మాజీ కేంద్ర మంత్రి పేదల పెన్నిధి టైగర్ ఆలె నరేంద్ర 12వ వర్ధంతి కార్యక్రమం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా బిజెపి కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవరశ్రీనివాస్ పాల్గొని ఆలె నరేంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు ఆనంద్‌గుప్త, క్రిష్ణ యాదవ్, వినోద్‌యాదవ్, రాదాకిషన్‌యాదవ్, నామ యాదగిరి నేత, సందేష్ యాదవ్, ప్రభు పూజారి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

అల్వాల్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: సురేష్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. మచ్చబొల్లారం మార్కెట్ వాసులకు చలివేంద్రం ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా బోర్లు వేస్తే చర్యలు: తహసీల్దార్

కంటోన్మెంట్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: నిబంధనలకు విరుద్ధంగా బోర్‌వెల్స్ వేస్తే చర్యలు తీసుకుంటామని మారేడ్‌పల్లి తహసీల్దార్ అసదుల్లాఖాన్ హెచ్చరించారు. కంటోన్మెంట్ 5వ వార్డు వెస్ట్ మారేడ్‌పల్లి సంతోష్‌మాత కాలనీలో ఒక వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ అనుమతులు తీసుకోకుండా బోర్‌వెల్స్‌ను వేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు మారేడ్‌పల్లి తహసీల్దార్ అసదుల్లాఖాన్ అదేశాల మేరకు ఆర్ఐలు అనుమతులు తీసుకోకుండా వేసిన బోర్‌వెల్‌ను సీజ్ చేశారు.

సాయిబాబా ద్వారకామాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త): బాగ్‌లింగంపల్లి శ్రీషిరిడీ సాయిబాబా దేవాలయ నిర్మాణ సమితి (ట్రస్ట్) ఆధ్వర్యంలో 10 , 11 తేదీలలో శ్రీసాయిబాబా ద్వారకామాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా నిర్వహించబోతున్నట్లు ఆలయం వ్యవస్థాపక ఉపాధ్యక్షుడు పెద్దొళ్ల గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ధర్మరాజు గౌడ్ వివరించారు. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉత్తరాయణచైత్ర మాసం కృష్ణ పక్షం నవమి తిథి ఉత్తరాషాడ నక్షత్రయుక్త అభిజిత్ ముహూర్తమున ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 10 న ఉదయం 8 గంటల నుండి గణపతి పూజ, కంకణ ధారణ, స్వస్తి పుణ్యాహవాచనం, ప్రధాన కలశ స్థాపన, జలాధివాసం వంటి కార్యక్రమాలు జరుగుతాయి. సాయంత్రం 6 గంటల నుండి హోమం, శయనాధివాసం, పుష్పాధివాసం నిర్వహించబడును. 11 న ఉదయం 8 గంటలకు స్థాపిత దేవతా మండపారాధన హోమం, స్వామి వారికి అభిషేకం, ఉదయం 11:55 నిమిషాల నుండి మధ్యాహ్నం 12:40 గంటల మధ్య గల శుభ ముహూర్తంలో ద్వారకామాయి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరగనుంది. ఈ కార్యక్రమాలను పురస్కరించుకుని విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం శనివారం మధ్యాహ్నం 12 గంటల నుండి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. భక్తులందరూ ఈ పవిత్ర కార్యక్రమానికి కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. విరాళాలు ఇవ్వదలచిన భక్తులు కార్యాలయంలో సంప్రదించగలరు.

బోరబండలోని శ్రీశ్రీశ్రీ నిమిశాంబదేవి ఆలయ వార్షికోత్స వేడుకలు

పాల్గొన్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : ఆలయాల పవిత్రను కాపాడుతూ ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని జూబ్లీహిల్స్ శాసనసభ్యులు నవీన్ యాదవ్ అన్నారు. గురువారం బోరబండ సైట్2 కాలనీలోని మల్లన్న దేవాలయ ప్రాంగణంలో శ్రీశ్రీశ్రీ నిమిశాంబదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువతో సన్మానించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR, HYDERABAD (SOUTH)

ABR.CF.No: HS 144 OF 2025

BETWEEN:-

M/S MARGADARSI CHIT FUND PRIVATE LIMITED, Ameerpet BRANCH, represented by its Foreman/Branch Manager. ...DISPUTANT

and

MR. S. SUMAN & OTHERS ...OPPONENT

1. **Mr. Savanapalli Suman,** S/o. Savanapalli Narsimha, Dob: 29/08/1986, W/as: Senior Assistant, Emp. code: 2604852, O/O Commissioner of Collegiate Education, Nampally, Hyderabad-500001. R/o H.No: 12-15-470/A/11, Manikeswari Nagar, Near Annapurna Tent House, O.U Campus, Secunderabad-500007.
2. **Mr. Kalleda Mukesh,** S/o. Kalleda Muthaiah, Dob: 14/08/1987, W/as:Junior Assistant, Emp.Code: 2606719, O/O Commissioner of Collegiate Education, Nampally, Hyderabad - 500001. R/o H.No:- 1-6-202/8/14/A/1, Bapuji Nagar, Near Lord Shiva Temple, Musheerabad, Hyderabad-500020.
3. **Mr. Palavai Srinivasa Chary,** S/o. Palavai Rama Chandraiah, Dob: 01/06/1971, W/as: Junior Assistant, Emp. Code: 2603603, O/O Commissioner of Collegiate Education, Nampally, Hyd-01. R/o Flat No.1, Plot No.11 & 12, Venkateshwara Havens, Rajiv Nagar Colony, Macha Bollaram, Trimulgherry, Secunderabad-500010.
4. **Mr. Anup Parlikar,** S/o Ramkrishna Parlikar, Dob: 05/06/1981, W/as:Senior Assistant, Emp.Code: 2604691, O/O Commissioner of Collegiate Education, Nampally, Hyd-01. R/o H.No: 16-2-740/75/6, VK Dhage Nagar Colony, Opp:Red Cross Hospital, Beside Raghavendra Tiffins, Gaddiannaram, Dilsukh Nagar, Hyderabad-500060.

...Respondents/Opponents

Please take notice that the above dispute is filed against you for recovery of **Rs.6,80,532-00** (Rupees Six Lakhs Eighty Thousand Five Hundred Thirty Two Only) same posted to **25-04-2026** to your appearance before the Office of Deputy Registrar of Chits Arbitrator, HYDERABAD (SOUTH) at 3.00 p.m. If you fail to attend the Office of Deputy Registrar of Chits/Arbitrator on that day the matter will be heard and decided exparte.

//BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR//

R. CHAKARDHAR
ADVOCATE
H.NO: 6-1-295/1, PADMARAO NAGA, SECUNDERABAD.

కుత్బుల్లాపూర్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే వివేకానంద్

పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త

మౌలిక వసతులను మెరుగు పరిచి కుత్బుల్లాపూర్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. గురువారం పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు సర్కిళ్లకు చెందిన జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధికారులతో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ నియోజకవర్గంలోని నూతన అభివృద్ధి పనులు, నిర్మాణ దశలో ఉన్న అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మంజూరైన 32 కోట్ల విలువగల పనులను పూర్తి చేయాలని, అలాగే నూతనంగా 72 కోట్ల నిధుల వ్యయంతో రూపొందించిన ప్రతిపాదనలకు త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రజా అభివృద్ధి, సంక్షేమంలో భాగంగా వివిధ డివిజన్లో పరిధిలోని బస్తీలు, కాలనీలలో నిర్మాణ దశలో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ప్రాధాన్యత క్రమంలో నూతన సిసి రోడ్లతో పాటు రోడ్డు ప్యాచ్ వర్క్ నిర్మాణ పనులు, భూగర్భ డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు పనులను చేపట్టి ప్రజలకు మెరుగైన మౌళిక వసతులను కల్పించాలన్నారు. పెరుగుతున్న పట్టణీకరణ, జనాభాకు అనుగుణంగా మెరుగైన మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా అవసరమైన చోట భూగర్భ డ్రైనేజీ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రణాళికలు రూపొందించి అభివృద్ధిపనులను చేపట్టి కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఈ శ్రీకాంతి, ఈఈ సుబ్రహ్మణ్యం, డీఈఈలు పాపమ్మ, సంధ్య, డి. విరాట్ రాజ్, వసంత, బాల మురళీ, ఏఈలు అనురాగ్, కళ్యాణ్, గోపాల క్రిష్ణ, ప్రవీణ్ కుమార్, సురేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ :: డివిజన్-30, GHMC

నిట్ నం. 01/E.E 30/GHMC/2025-26, తేది: 08.04.2026. పని పేరు: GHMC, KZ, డివిజన్-30 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు. అంచనా మొత్తం: 60.00. బిడ్స్ స్వీకరణలకు ప్రారంభ తేదీ/చివరి తేదీ, సమయం: బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 09.04.2026 ఉ.11.00 గం. వద్ద మరియు బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ & సమయం: 13.04.2026 ఉ.11.00 గం. వద్ద. అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-30 GHMC, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ వద్ద చూడవచ్చును. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-30, GHMC,

DIPR.No.393-PP/CL/Advt/1/2026-27, తేది: 09.04.2026

IN THE COURT OF THE HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT COURT, AT: KUSHAIGUDA.

E.P.NO. 128 OF 2025
IN
A.A/CF NO.267 OF 2018.

Between:-

M/s. Shriram Chits (India) Pvt. Ltd., ...Decree Holder

And

Sri. C. Salimoon & Others ...Judgement Debtor

To,

Jdr.No.3 Sri. Ch. Narender Kumar, S/o. Ch. Narsimha, Aged about 38 Yrs., Occ: WA/A, Emp. No.6-7511, O/0. NFC, Moulali, Medchal-Malkajgiri District. R/o. H.No.1-1-62, Street No. 1, Habsiguda, Uppal Road, Hyderabad.

Please take notice that the above E.P. is filed against you for Recovery of Money **Rs.3,89,783/-** and the same is posted to **21-04-2026** for your appearance in the Court at **10.30 A.M.,** if you fail to attend the court on that day the matter will be heard and decided expate.

(By ORDER OF THE COURT)

Sri. K. Yadagiri Rao
Smt. D. Santhosh Kumar
ADVOCATES.
0/0. 207 & 208, Aditya Towers, Vinayak Nagar, Neredmet, Hyderabad-56
Counsel for Decree-Holder.

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT, AT: HYDERABAD

O.S NO. 921 OF 2026

BETWEEN:

SMT. E.V. PADMAVATHI AND OTHERS ...PLAINTIFFS

AND

THE MRO/TAHSILDAR SHAIKPET MANDAL & ALL CONCERNED ...DEFENDANTS

TO

All Concerned

WHEREAS THE ABOVE PLAINTIFFS i.e., **1) SMT. E.V. PADMAVATHI, 2) SMT. E. SURYA SAHITHI, 3) SRI E. VENKATA NAGA SAKETH** HAVE FILED SUIT THROUGH O.S. NO. 921 OF 2026 AGAINST 1) THE MRO/TAHSILDAR SHAIKPET MANDAL & ALL CONCERNED ON THE FILE OF HON'BLE II JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS, AT: HYDERABAD, PRAYING TO DECLARE THE PLAINTIFFS AS BEING ONLY LEGAL HEIRS OF THE DECEASED PERSON NAMED LATE SRI E.V.V. SUBBA RAO ALIAS EMANI VYAGARI VENKATA SUBBA RAO S/O. LATE EMANI SURYANARAYANA ANY INTERESTED PERSONS IN THE ABOVE MATTER ARE HERE BY INFORMED THAT, THEY WOULD APPEAR IN THE COURT AT 10.30 A.M ON 04/05/2026 IN THE ABOVE COURT EITHER THROUGH COUNSEL OR PARTY-IN-PERSON, OTHERWISE THE HON'BLE COURT WILL DECIDE THE CASE ON MERITS.

BY ORDER OF THE COURT

M/s. A. JAYANTH REDDY,
Ms. KEDARI SAI GEETIKA
(ADVOCATES) O/o: H.No. 301, 3rd Floor, Gayatri Heights Apartment, behind Government Degree College, Priyadarshini colony, Hayatnagar, Ranga Reddy District,T.S-501505
P.H. No. 8686692858, 8121729308.

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL JUNIOR JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT AT MEDIPALLY

O.S. No. 930 of 2020

Between:

P Pramod Kumar & others ...Plaintiff

AND

Jitta Balram & others ...Defendants

To,

1. **Jitta Balram** S/o. J. Swamy, age 76 years, Occ. business, R/o. H.No. 3-15-G16/301, Sahara Estates, Mansoorabad, Rangareddy District.
2. **P. Vinod Kumar** S/o. late Chandrashekar, aged 66 years, Occ. business, R/o. H.No.3-6-55/O, Indiranagar, Ramanthapur, Uppal Mandal, Medchal Malkajgiri District. **Defendants No.1&3**

NOTICE

Please take notice that the plaintiffs have filed the above Suit for declaration and recovery of possession of the suit property against the defendants, the Hon'ble Court was pleased to post the above suit on **16.04.2026 at 10:30 AM** for your appearance and Counter/written statement, if any. In spite of this clear notice, if you failed to appear before the Hon'ble Court, the matter will be decided in your absence. Hence, this Notice.

(BY ORDER OF THE COURT)

Sd/- V. Thrimurthulu
Advocate

ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బిజెపి ఆందోళన

ఆందోళన చేస్తున్న బిజెపి సీనియర్ నేతలు సామ సంజీవరెడ్డి, గుర్రం మల్లారెడ్డి తదితరులు

సరూర్‌నగర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: హింసను ప్రేరేపించేలా జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు తీవ్ర వాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ గురువారం బడంగ్‌పేట్‌లో బిజెపి నాయకులు ఆందోళన చేశారు. ఈ మేరకు ఎఐసిసి అధయక్షుడు మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు మాట్లాడుతూ బిజెపి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను అంతమొందించాలని కాంగ్రెస్ అగ్రనేత హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడారని దుయ్యబట్టారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వెంటనే కేంద్రం ఖర్గేపై చర్యలు తీసుకోవాలని కోరారు. హింస ప్రేరేపిత వ్యాఖ్యలు చేసిన మల్లిఖార్జున ఖర్గే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ సామ సంజీవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మల్లారెడ్డి, బడంగ్‌పేట్ అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, రావుల మల్లేష్, కొంతం మురళీధర్‌రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, చిత్రం శ్రీనివాస్, సామ సుధాకర్‌రెడ్డి, బంగారు రాహుల్, కావ్య, పద్మజ పాల్గొన్నారు.

మహేశ్‌కుమార్‌గౌడ్, తీగల కృష్ణారెడ్డిలను కలిసిన టిపిసిసి లీగల్ సెల్ కన్వీనర్

తీగల కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానిస్తున్న టిపిసిసి లీగల్ సెల్ కన్వీనర్ ప్రమోద్ పటేల్

సరూర్‌నగర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) లీగల్, హ్యూమన్ రైట్స్ అండ్ ఆర్‌టిఐ విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన పొట్లచెరువు ప్రమోద్ మర్యాదపూర్వకంగా టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డిలను కలిసారు. గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షుడిని అదే విధంగా టికెఆర్ క్యాంపు ఆఫీస్ మీర్‌పేట్‌లో తీగల కృష్ణారెడ్డిలను వేర్వేరుగా కలిసిన ప్రమోద్ పటేల్ వారిని శాలువాలు, పూలమాలలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రమోద్ మాట్లాడుతూ పార్టీ ఆదేశించే కార్యక్రమాలను విజయవంతం చేయడానికి కృషి చేస్తానని వారితో స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌరీశెట్టికి ఘన సత్కారం

చంద్రశేఖర్ గుప్తను సన్మానిస్తున్న ఉపేందర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: నిత్యం సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి అభిమానాన్ని చేరగొంటున్న చంద్రశేఖర్‌గుప్తా అందరికీ ఆదర్శం అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ పరిధిలోని వాసవికాలనీ అధ్యక్షులు, అష్టలక్ష్మీ దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు, గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా వాసవి సేవ కేంద్రానికి అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా గురువారం ఆయన నివాసానికి వెళ్ళి శుభాకాంక్షలు తెలియజేసి, జ్ఞాపికను అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గంప జగన్, అయిత అంజయ్య, గౌరిశెట్టి అరుణ్, కొండమీది రమణయ్య, దాచేపల్లి శ్రీనివాస్, జగని రమేష్, తమన్నా సుజాతశ్రీధర్, నవీన్, గందే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డాన్ బాస్కో బ్రదర్స్‌స్పోర్ట్స్ అకాడమీ ప్రారంభం

రామంతాపూర్‌లో డాన్ బాస్కో స్పోర్ట్ అకాడమీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ తదితరులు

రామంతాపూర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : రామంతాపూర్ ప్రగతినగర్‌లో డాన్ బాస్కో బ్రదర్స్ స్పోర్ట్స్ అకాడమీని గురువారం మాజీ ఐపిఎస్ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాన్ బాస్కో బ్రదర్స్ స్పోర్ట్స్ అకాడమీ స్పోర్ట్స్ డైరెక్టర్ మధుసూదన్, ఫిట్ అడ్డా టీమ్ మెంబర్ ప్రశాంత్ కుమార్, ఫాదర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ డాన్ బాస్కోలో ఉన్న అనాధ పిల్లలకి ఉచితంగా శిక్షణ ఇవ్వడం హర్షనీయమన్నారు. అనాధ పిల్లలతోపాటు, తర పిల్లలకు కలిపి ప్రైవేట్ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనాధ పిల్లలకు ప్రైవేట్ కోచింగ్ పిల్లలతో ఏమాత్రం తీసిపోకుండా ప్రొఫెషనల్ ట్రైనింగ్ ఇస్తున్నందుకు ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. వేసవి సెలవులలో రామంతాపూర్ పరిసర ప్రాంతాల్లో విద్యార్థుల తల్లి తండ్రులు వారి పిల్లలని చేర్పించి పిల్లలను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు.కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ వాటర్ ప్లాంట్‌లో అధికారుల తనిఖీలు



వాటర్ ప్లాంట్ ను పరిశీలిస్తున్న అధికారులు

మలక్ పేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: అక్రమంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్ పై చార్మినార్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఓల్డ్ మలక్ పేట్ లోని గ్రీన్ నెస్ట్ మినరల్ వాటర్ ప్లాంట్ ను అధికారులు తనిఖీలు చేసి అవసరమైన, చట్టబద్ధమైన అనుమతులు లేకుండా కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అదేవిధంగా సరైన నాణ్యత ప్రమాణాలను పాటించకుండా అనారోగ్యకరమైన పరిస్థితులలో మంచినీటిని తయారు చేస్తున్నట్లు బహిర్గతమైంది. దీంతో కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు నిమిత్తం చాదర్ ఘాట్ పోలీసులకు అప్పగించారు.

పాలకవర్గం ఆమోదంతోనే అభివృద్ధి చేశాం తప్ప అవినీతి చేయలేదు

బిఆర్ఎస్, బిజెపి నేతలు చేస్తున్న అసత్య ప్రచారాలను ఖండిస్తున్నాం

బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

బడంగ్‌పేట్ అవినీతిలో తమ ప్రమేయం లేదని వివరణ ఇచ్చే క్రమంలో విలపిస్తున్న బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా తాను పాలకవర్గంలోని డిప్యూటీ మేయర్, అన్ని పార్టీల కార్పొరేటర్ల ఆమోదంతో చేసిన తీర్మానాలతోనే అభివృద్ధి చేశామే తప్ప ఎటువంటి అవినీతి చేయలేదని చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. 2020 జనవరి నుండి 2025 జనవరి వరకు ఐదేళ్ళ తమ పాలనలో ఏమైనా జరిగితే దానికి మేము బాధ్యత వహిస్తామే తప్ప ఆ తర్వాత స్పెషలాఫీసర్ పాలనలో జరిగితే మాకేం సంబంధం అని ఆమె ప్రశ్నించారు. బడంగ్‌పేట్‌లో కోట్లాది రూపాయల అవినీతి అక్రమాలు జరిగాయనీ గత కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారంపై ఎట్టకేలకు మాజీ మేయర్ స్పందించారు. ఈ మేరకు గురువారం బాలాపూర్‌లోని తన నివాసంలో కౌన్సిల్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డిలతో పాటు డిసిసిబి మాజీ ఛైర్మన్, బండ్లగూడ(బాలాపూర్) ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ ఛైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి, కాంగ్రెస్ నేతలు బాల్‌నింగని జంగయ్య, మేకల సంజీవ, గొరిగె శ్రీశైలం, నీరుడు శ్రీరాములు తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె వివరణ ఇచ్చారు. అవినీతిపై మాట్లాడే క్రమంలో ఆమె కన్నీటిపర్యంతం కాగా పక్కన కూర్చున్న నేతలు ఆమెను ఓదార్చారు. అనంతరం తమాయించుకొని ఆమె మాట్లాడుతూ బడంగ్‌పేట్‌లో అవినీతి, అక్రమాలు, అధికారుల సస్పెన్షన్ ఉదంతంలో తమను టార్గెట్ చేస్తూ బిజెపి, బిఆర్ఎస్‌లు తమపై రాజకీయంగా బురద జల్లే ప్రయత్నాలు చేయడాన్ని ఆమె ఖండించారు. తమ పాలనలో బడంగ్‌పేట్ అభివృద్ధికి చిరునామాగా నిలిచిందనీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ల ఆమోదం లేనిదే ఒక్క పని కూడా చేయలేదని ఆమె వెల్లడించారు. గడచిన 20 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నామనీ మొదట్లోనే మేజర్ గ్రామ పంచాయతీ బాలాపూర్‌కు సర్పంచ్‌గా పని చేశామనీ ఆనాటి నుండి ఈ నాటి వరకు ఏ తప్పు చేయలేదని ఆమె స్పష్టం చేశారు. చేయని పనులకు బిల్లులు తీసుకున్నారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదనీ బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణాల్లో రూ.40 లక్షల అవినీతి జరిగిందని బిజెపి నేతలు పిచ్చికూతలు కూయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు పూర్తి కాలేదనీ ఇంకా ఎంబి రికార్డు కాకుంటే బిల్లులు ఎలా చెల్లిస్తారని ఆమె ప్రశ్నించారు. పాలకవర్గంలోని కార్పొరేటర్లకు తెలియకుండా ఏ పనీ జరగదనీ అన్నీ ఎజెండా తీర్మానాల ప్రకారమే అభివృద్ధి చేశామే తప్ప అవినీతి చేయలేదని అన్నారు. ఇష్టారాజ్యంగా బిల్లులు ఇవ్వడానికి తమకు చెక్ పవర్ ఉండదనీ కార్పొరేటర్ల అనుమతి లేనిదే ఏ పనీ జరగలేదని ఆమె అన్నారు. తమ పదవీ కాలం ముగిసిన తర్వాత ఏమైనా అవినీతి జరిగి ఉంటే దానికి స్పెషలాఫీసర్‌దే బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. కార్పొరేషన్ ఉన్నప్పుడు కమీషనర్‌గా ఉన్న సరస్వతి తిరిగి సర్కిల్‌గా మారిన తర్వాత డిసిగా ఇక్కడికి రావడంలో తమ ప్రమేయం లేదని ఆమె అన్నారు. ఐదేళ్ళలో మొత్తం బడ్జెటే దాదాపు 430 కోట్లు ఉంటే ఒక సారి 122 కోట్లనీ మరో సారి 150 కోట్లనీ చివరకు 500 కోట్లు అవినీతి జరిగిందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఆమె అన్నారు. కాంగ్రెస్ పాలనలో అవినీతి జరగదనీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నదని ఆమె తెలిపారు. తమ పదవీ కాలంలో ఏమైనా జరిగితే బాధ్యత వహిస్తామే తప్ప ముగిసిన తర్వాత కాదని ఆమె తేల్చి చెప్పారు.

తెలంగాణ ఉద్యమంలో టైగర్ నరేంద్రది కీలక పాత్ర:కటకం

మాజీ కేంద్రమంత్రి నరేంద్ర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కటకం నర్సింగరావు

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో మాజీ కేంద్ర మంత్రి టైగర్ ఆలె నరేంద్రది కీలక పాత్ర అని మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ్‌రావు పేర్కొన్నారు. నాగోల్ మన ఆలోచన సాధన సమితి ప్రధాన కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు అధ్యక్షతన ఆలె నరేంద్ర వర్థంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాజకీయాల్లో, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఒక శక్తివంతమైన నాయకుడు.టైగర్ నరేంద్ర అన్నారు. హిమాయత్‌నగర్ నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా, మెదక్, నిజామాబాద్ నుండి ఎంపీగా, గ్రామీణాభివృద్ధి శాఖ కేంద్రసహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉగ్రరూతలూగించి పార్లమెంటులో తెలంగాణ వాణిని బలంగా వినిపించిన మహా నాయకుడు నరేంద్ర అన్నారు. పాతబస్తీలో హిందూ వాహినిని బలోపేతం చేయడంలో ఆయన కృషి మరువలేనిదని కొనియాడారు.డబ్బుంటేనే రాజకీయం చేయొచ్చనే ఈనాటి నాయకులు, డబ్బు ప్రభావం లేకుండా రాజకీయాలు ఎలా చేయాలో టైగర్ నరేంద్రను చూసి నేర్చుకోవాలన్నారు. నరేంద్ర ధైర్యానికి, వెనకడుగు వేయని నైజానికి నిదర్శనంగా టైగర్ అనే బిరుదుకు గౌరవం పెంచిన మహానాయకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో కోల భాస్కర్, పీ.కృష్ణమూర్తి,వేముల రామునేత, పెద్దపూర బ్రహ్మయ్యరజక, గుణగంటి చంద్రశేఖర్‌గౌడ్, మంగిలిపల్లి శంకర్, వద్దేపల్లి దశరథసాగర్, మేకపోతు నరేందర్‌గౌడ్,మారోజు రాజుచారి, బీసీ కులాల సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ రఘురానేత, రామునేత, దాసరి మల్లేష్,కె.వి.గౌడ్,కోరంగి దుర్గారాణి, ఇందు, యాదమ్మ, రమ గంగపుత్ర ,జ్యోతి, శ్రీగాది కృష్ణయ్య, అలివేలు పద్మ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి శ్రీ మహాకాళి దేవి విగ్రహా ప్రతిష్టాపన ఉత్సవాలు

రామంతాపూర్‌లోని శ్రీ మహాకాళిదేవి విగ్రహా ప్రతిష్ట పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ సుర్వి భీష్మాగౌడ్ తదితరులు

ఉప్పల్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : రామంతాపూర్‌లోని శ్రీ మహాకాళిదేవి విగ్రహా ప్రతిష్ట, ద్వార దేవతల యంత్ర విగ్రహా ప్రతిష్ట, కుంభాభిషేకం కార్యక్రమాలు ఈనెల 27 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి చైర్మన్ సుర్వి భీష్మ గౌడ్, సర్వ సత్తయ్య యాదవ్, రేవు కృష్ణయ్య, బుర్ర రాజేశ్వర్, ముత్యాల లక్ష్మణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం రామంతాపూర్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రామంతాపూర్‌లోని ప్రసిద్ద శ్రీ మహాకాళి ఆలయంలో ఈనెల 27 నుంచి 29 వరకు అమ్మవారి ప్రతిష్టాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుష్పగిరి పీఠాధిపతి విద్యా శంకర భారతీ స్వామి, వర్గల్ విద్యా సరస్వతి దేవాలయం వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర సిద్దాంతి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, డి.శ్రీధర్‌బాబు, ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్,బేతి సుభాష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి, పలువురు మాజీ కార్పొరేటర్లు, మాజీ చైర్మన్ మేకల శివారెడ్డి తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈనెల ఉదయం గణపతిపూజ, పుణ్యాహావచనము, పరిషత్తు, దీక్షాదారణ, రక్షా బంధన, ఋత్విక్కరణ, యాగ శాల ప్రవేశం, అఖండ దీపారాధన,ప్రతిమా శోధనం, అమ్మవారి గ్రామ ప్రదణ నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం మంటప అదిష్టాన దేవతా హోమం, జలాదివాసం, హారతి, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. 28వ తేదిన కలశ సన్నపనము, మంటప పూజ, చండీ హోమం, సాయంత్రం ద్యానాధివాసము, శయ్యది వాసము, హారతి, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. ఈనెల 29వ తేదిన ఉదయం మంటప అవాహిత దేవతా హోమము, కళాన్యాస హోమము, పీఠ పూజ, కళాన్యాస హోమం, గర్త సంస్కారం, స్వామి వార్లచే యంత్ర ప్రతిష్ట, విగ్రహా ప్రతిష్ట, కుంభాభిషేకం ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం గురువారి దివ్య భాష్యం, నేత్రన్మీళనం, బలిహరణం, పూర్ణాహుతి, దేవిదర్శనం, అన్న సమారాధన, సాయంత్రం వేదాశ్వీరచనము, పండిత సన్మానం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాం : ఎమ్మెల్యే బండార్ లక్ష్మారెడ్డి.

కుషాయిగూడ,ఏప్రిల్ 9, ప్రభాతవార్త...

సమాజ సేవ కోసం నాయకులను తయారు చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం అండగా నిలుస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ మదర్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకొని కాప్రా సర్కిల్ పరిధిలోని రాధిక చౌరస్తాలో గల పరివార్ హోటల్లో క్లబ్ అధ్యక్షులు లయన్ వడ్లోజు జ్యోతిర్మయ చారి(వార్తా చారి)అధ్యక్షతన ఏర్పాటుచేసిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన తోపాటు మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, ఉప్పల్ ఏసిపి వెంకట్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమం కోసం తమ వంతు సహకారం ఉంటుందన్నారు. ముఖ్యంగా పాత్రికేయులకు డబల్ బెడ్ రూమ్ నివాసాలను అందించేందుకు కృషి చేస్తానన్నారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కోసం, ఆరోగ్య స్కీం అమలుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. సమాజంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమైంది అన్నారు. పాత్రికేయుల పాత్రకు తమ వంతు సహకారం ఉంటుందని ఉప్పల్ ఏసిపి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న పాత్రికేయులంతా బాగుండాలని ఆకాంక్షించారు. సమాజంలో ఎలా నాలుగు స్తంభాలలో అతి కీలకమైన పాత్రికేయుల వ్యవస్థ ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సమాధ్యక్షులు, కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ నూతన అధ్యక్షులు లయన్ వడ్లోజు జ్యోతిర్మయా చారి పేర్కొన్నారు. సమాజం కోసం నాయకుల ఎదుగుదల కోసం సమాజంలోని రుగ్మతల రూపుమాపడానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల ఆర్థిక సామాజిక మానసిక స్థాయికి ప్రతి ఒక్కరు సహకరించే ప్రయత్నం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీ లో అధ్యక్షులు వడ్లోజు జ్యోతిర్మయాచారి (వార్త చారి), ప్రధాన కార్యదర్శి ఆదిమూల శ్రీనివాస్, కోశాధికారి వట్టిపల్లి సురేష్, ఉపాధ్యక్షులు లక్కడి బాల్రెడ్డి కార్యనిర్వాక కార్యదర్శి గద్దమీద బాలరాజు గౌడ్, కార్యదర్శి గుమ్మడి రోజా రాణి ప్రమాణ స్వీకారం చేశారు . టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ మాట్లాడుతూ సమాజంలోని అవకతవకలను ఎత్తి చూపే క్రమంలో జర్నలిస్టులు డేగ కన్ను వేయాలన్నారు.ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కమిటీ చైర్మన్ ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రముఖ సంఘ సేవకులు లయన్ మాణిక్ రెడ్డి పాత్రికేయ కుటుంబాలకు 32 మందికి కుట్టుమిషన్లను అందజేశారు. కుషాయిగూడ క్రైమ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు సబ్ ఇన్స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్, సతీష్ విజయ్ఈ కార్యక్రమంలో చర్లపల్లి ఐలా చైర్మన్ గోవింద్ రెడ్డి, టిఫ్ చైర్మన్ సుధీర్ రెడ్డి చర్లపల్లి ఐల మాజీ చైర్మన్ రోషి రెడ్డి జలంధర్ రెడ్డి, గోపాలరావు, తాటి శ్రీనివాస్ వెంకటేశ్వర్ రెడ్డి,లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇన్నారెడ్డి డిస్టిక్ కలెక్టర్ గవర్నర్ కళ్యాణ్ కృష్ణారెడ్డి డిస్టిక్ వైస్ డిస్టిక్ మొదటి గవర్నర్ డాక్టర్ మండా సురేష్, డిస్టిక్ సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ శేఖర్ రెడ్డి, కాప్రసెరికి లీప్టి కమిషనర్ శ్రీహరి, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, బిజెపి అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్, సిపిఐ జాతీయ నాయకులు వి ఎస్ బోస్, సిపిఎం నాయకులు యాదగిరిరావు కోమటి రవి, బిజెపి రాష్ట్ర నాయకులు ఏనుగు రాజిరెడ్డి, నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి,కనుకుల రజినీకాంత్ రెడ్డి, రజినీకాంత్ రెడ్డి, రాంప్రదీప్ మునుగంటి,మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి,స్వర్ణరాజ్ శివమణి, బొంతు శ్రీదేవి,గుండారపు శ్రీనివాసరెడ్డి ప్రభుదాస్ పొన్నాల దేవేందర్ రెడ్డి,కమిటీ సలహాదారులు చంద్రమోళి,కేసి మోహన్, కేసి మోహన్ సత్యనారాయణ, కడియాల రమేష్, కొత్త శ్రీనివాసరావు,, ఉల్లోజు శ్రీనివాస్, కీసరి సహదేవా చారి, వేముల శంకర్, శ్రీరామ్ శ్రీనివాస్, విజయ్ కుమార్, నర్సింగ్ రావు గౌడ్ గుమ్మడి ప్రసాద్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో ఘనంగా ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ వేడుకలు

ఎన్ఎస్‌యుఐ వార్షికోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరిస్తున్న డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ తదితరులు

రామంతాపూర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : రామంతాపూర్‌లో ఎన్ఎస్‌యుఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రామంతాపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ రఫీక్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్ కోసం ఎన్ఎస్‌యుఐ కార్యకర్తల చేసిన కృషి మరువలేనిదన్నారు. విద్యార్థుల సమస్యలపై ఎన్ఎస్‌యుఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. యువ నాయకులు సాయి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. విద్యార్థి హక్కుల కోసం నిరంతర పోరాటం చేస్తుందని, యువతలో రాజకీయ చైతన్యం తీసుకుని వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు సాయి దీపక్, సాయికిరణ్, దత్తు, వర్షిత్, శ్రీకాంత్, మనోజ్ , సీనియర్ కాంగ్రెస్ నాయకులు బెస్త భాస్కర్, కేబుల్ అశోక్, యువజన కాంగ్రెస్ నాయకులు ఎండి షకీల్, ఎండి.నయీమ్, సూరి ఐకాన్ మధు, ఎండి జాహంగీర్, ఎం.డి.వాజీద్,ఎం.డి.మోయిన్ పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా నేనున్నానంటూ

తుర్కయంజాల్ ఏప్రిల్ 9(ప్రభాతవార్త) ఆపదలో ఉన్న తెలంగాణ ఉద్యమకారుడు నక్క జంగయ్యగౌడ్ కుటుంబానికి టీజీ టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అండగా నిలిచారు. జంగయ్యగౌడ్ కూతురు అనూష కాలేయం సమస్యతో బాధపడుతోంది. ఆరోగ్యం బాగుపడాలంటే వైద్యులు రూ.80లక్షల వరకు ఖర్చుపుతుందని తెలిపారు. పేద కుటుంబానికి చెందిన జంగయ్యగౌడ్ అంత ఖర్చుపెట్టి వైద్యం చేయించుకునే పరిస్థితి లేదు. దీంతో విషయం తెలుసుకున్న కొత్తకుర్మ సత్తయ్య రూ.25వేల చెక్కును జంగయ్యకు అందజేశారు. అలాగే ప్రభుత్వంతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడి వైద్య ఖర్చులకు అయ్యే డబ్బు సమకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు. జంగయ్యకు సాయం చేయదలిచినవారు ఫోన్ నెంబర్ 93470 96677ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు జెనిగె విష్ణువర్దన్, కొంతం యాదిరెడ్డి, కారింగుల నరేందర్ గౌడ్, పాల్గొన్నారు

అక్రమంగా ఇంజక్షన్లు విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇంజెక్షన్లు, సెల్ ఫోన్లు, కత్తి తదితర వస్తువులు

మలక్ పేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: అనధికారికంగా ఇంజెక్షన్లను కలిగి ఉండడం తో పాటు అక్రమంగా ఇంజక్షన్లను విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 7 మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు, ఒక కత్తి, 3సెల్ ఫోన్లు, సిరంజిలు స్వాధీనం చేసుకున్న సంఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి కథనం ప్రకారం చాదర్ ఘాట్ పోలీసులు ఓల్డ్ మలక్ పేట వాహెబ్ నగర్ వాటర్ ట్యాంక్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు మహమ్మద్ అహ్మద్ (49), మహమ్మద్ ఉమార్ (19)లు అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. దీంతో పోలీసులు వారిని ఆపి తనిఖీలు చేయగా వారి వద్ద నుంచి 7 మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు, ఒక కత్తి ఉండడం తో స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి మాట్లాడుతూ అనుమతి లేకుండా మెడికల్ ఇంజెక్షన్లను కలిగి ఉండటం మరియు అమ్మడం శిక్షార్హమైన నేరమని తెలిపారు.ప్రజలు అనధికార వ్యక్తుల వద్ద నుండి మందులు లేదా ఇంజెక్షన్లు కొనుగోలు చేయవద్దని ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి సూచించారు.

ఎస్ఐఆర్ పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



చంచల్ గూడలో ఎస్ఐఆర్ పై ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ సలాం షాహిద్ తదితరులు

మలక్ పేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: ఎస్ఐఆర్ పై ఓటర్లకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చావుని డివిజన్ మాజీ కార్పొరేటర్ సలాం షాహిద్ పేర్కొన్నారు. చంచల్ గూడ లోని తన కార్యాలయంలో ఎస్ఐఆర్ పై ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ పై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ పేర్లను ఓటర్ లిస్టులో నమోదు చేసుకోవాలని కోరారు. ఓటర్ల లిస్టులో తమ పేర్లు ఉన్నాయా లేదో పరిశీలించుకుని సంబందిత అధికారులు, సిబ్బందితో మ్యాపింగ్ చేయించుకోవాలని పేర్కొన్నారు. మలక్ పేట్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లో ఎస్ఐఆర్ పై సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెండా దిమ్మెకు రంగు మార్చిన వైనంపై బిఆర్ఎస్ ఫిర్యాదు

సరూర్‌నగర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: బిఆర్ఎస్ జెండా దిమ్మెకు ఉన్న గులాబి రంగు మార్చి కాషాయ రంగు వేయించిన బిజెపి నేతపై చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ నాయకులు మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఇన్స్‌పెక్టర్ శంకర్ నాయక్‌ను కలిసి బిజెపి నేతపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బలరామకృష్ణ, దిండు భూపేష్‌గౌడ్, జటావత్ శ్రీనివాస్ నాయక్, దోమలపల్లి రాజ్‌కుమార్, ఉయ్యాల నవీన్‌గౌడ్, ఎనుగుల అనిల్ యాదవ్, అబ్బనమోని గోపి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదు

ర్యాలీలో మాజీ కార్పొరేటర్, ఆసుపత్రి సిబ్బంది

హయత్ నగర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని...వారికి సరైన మందులు అందేలా చూడాలని అడిషనల్ డిఎంహెచ్ఓ డా. వై.పాపారావు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్య క్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, డిస్టిక్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవి ఎయిడ్స్ ఆధ్వర్యంలో గురువారం హయత్ నగర్ లోని కమ్యూనిటీ హెల్త్ కేర్ సెంటర్ లో హెచ్ఐవిపై అవగాహన కార్యక్రమం, రెడ్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... హెచ్ఐవి పై అందరికీ అవగాహన కల్పించాలని, ఒకప్పుడు హెచ్ఐవి కి సరైన మందులు ఉండేవి కావని ఇప్పుడు మంచి మందులు వచ్చాయని వాటిని ఉపయోగించుకుంటూ ఎక్కువ కాలం జీవించవచ్చని తెలియ జేశారు. హెచ్ఐవి వ్యాధి గ్రస్తులకు లింక్ ఎఆర్టి సెంటర్ ద్వారా మందులను అందిస్తున్నా మని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నర్సింగ్ కాలేజీ విద్యార్థులకు హెచ్ ఐ వీ పై వ్యాసరచన కార్యక్రమం నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మన్సురాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి, టి.బి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆయేషా, ఇబ్రహీం పట్నం డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, అబ్దుల్లాపూర్ మెట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, డా. వినోద్, డా. రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులపై అడ్డగోలుగా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

తుర్కయంజాల్ ఏప్రిల్9(ప్రభాతవార్త)

ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని కోహెడలో బీ ఆర్ ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ నరసింహా గౌడ్ మాట్లాడుతూ గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చిలుక మధుసూదన్ రెడ్డి బీ ఆర్ ఎస్ నాయకులపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి మెప్పు పొందడానికి, తమ స్వార్ధ ప్రయోజనాల రాజకీయాలు చేస్తూ ఇష్టానుసారంగా నోరు పారేసుకుంటే భవిష్యత్తులో ఇబ్రహీంపట్నం గడ్డ పై తిరగనివ్వమని హెచ్చరించారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అయి ఉండి తన స్థాయిని మరిచి, అర్హత లేని వారు బీ ఆర్ ఎస్ నాయకులపై విమర్శలు చెస్తే భవిష్యత్తులో ప్రజలే బుద్ధి చెబుతున్నారన్నారు. రైతుల శ్రేయస్సు కోసం, భవిష్యత్తులో అవసరాలను దృష్టిలో పెట్టుకొని కోహెడ లో 200 ఎకరాలలో అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్ నిర్మించాలని గతంలో కే సీ ఆర్ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.ఫ్రూట్ మార్కెట్ కు కేటాయించిన భూములను టీజీఐసీ ఇచ్చి అక్కడ నుంచి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రూట్ మార్కెట్ ను కేసులు ఉన్న భూమిలోకి తరలించేందుకు కుట్ర చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో కే సీ ఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నేత, బీ ఆర్ ఎస్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, బిందు రంగారెడ్డి, రామావత్ కళ్యాణ్ నాయక్, సామ శ్రీనివాస్ రెడ్డి, చక్రవర్తి గౌడ్, కిషన్ గౌడ్, బుడ్డ బాబు, కోటేశ్వరరావు, ధనుంజయ్ గౌడ్, పల్లపు ఆంజనేయులు పాల్గొన్నారు

విద్యుత్ ఆర్టిసన్ల సమస్యలను పరిష్కరించాలి : జాయింట్ సెక్రటరీ ఆలీఖాన్

ఆస్మాన్ ఘడ్ విద్యుత్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఆలీఖాన్, కో కన్వీనర్ మునిలాల్ నాయక్, జేఏసీ చైర్మన్ రాము, సురేష్ గౌడ్ తదితరులు.

మలక్ పేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:

విద్యుత్ ఆర్టిసన్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఆలీఖాన్, జెఎసి కంపెనీ కో కన్వీనర్ మునిలాల్ నాయక్, సౌత్ సర్కిల్ జేఏసీ చైర్మన్ ఎం. రాములు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ అస్మాన్ ఘాడ్ డివిజన్ ఆధ్వర్యంలో విద్యుత్ ఆర్టిసన్, అన్ మ్యాన్డ్, పీస్ రేటు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆస్మాన్ ఘాడ్ విద్యుత్ కార్యాలయం వద్ద రెండవ రోజు నిరవధిక సమ్మె కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా అర్హతల ఆధారంగా ఆర్టిసన్ ఉద్యోగుల కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, టిజిఎస్పిడీసీఎల్, టీజీఎస్పీడీసీఎల్ లలో అన్ మ్యాన్డ్ వర్కర్లను ఆర్టిజన్లుగా విలీనం చేసుకోవాలని కోరారు. విద్యుత్ సంస్థలో 2016 డిసెంబర్ 4వ తేదీ కంటే ముందు అన్ని అర్హతలు ఉండి పనిచేస్తూ, ఇప్పటికీ అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులుగా కొనసాగుతున్న వారిని ఆర్టిసన్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న పీస్ రేట్ కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు. హైదరాబాద్ సౌత్ జిల్లా సిఐటియు కార్యదర్శి శ్రవణ్ కుమార్ తదితరులు విచ్చేసి సమ్మె కు మద్దతు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు ముజిబ్ బాయి, ఫయిం బాయ్, సుభాష్ , ఎస్.సురేష్ గౌడ్, లక్ష్మీనారాయణ, గాబ్రియల్, మహ్మద్ తైసిన్, ప్రభాకర్, దాస్, సైయద్ షఫీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

టిజియుకెఎస్ఎస్ ఉపాధ్యక్షుడిగా జాహిద్



ఎల్.బి.నగర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం మహే శ్వరం నియోజకవర్గం ఉపాధ్యక్షుడిగా ఎండి.జాహిద్ నియామకం అయ్యారు. ఈ మేరకు సంక్షేమ సంఘం చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణగుప్తా జారీ చేసిన నియామక పత్రాన్ని గురువారం జాహిద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జాహిద్ మాట్లాడుతూ మలిదశ ఉద్యమంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అనేక పోరాటాలు నిర్వహించ డం జరిగిందన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలిపారు.